
# మన సంస్కృతి



చెప్యాల మలహల్ రావు

PART - II

# PART - II

వ్యక్తులప్రతినిధులను మాయతో కల్పించి నాశనం చేసే బొమ్మలగారడీలాగా ఉంటుంది.

**క్రిమిరోగాల నరికడతాను!**

క్రిములవల్ల మానవశరీరంలో అనేకరోగాలు కలుగుతున్నాయనే సత్యం ఈ వేదంలో గుర్తింపబడింది. ఆ రోగాలను పోగొట్టుకోవడానికి ఈ సూక్తం ఉపయోగపడుతుంది. చూడండి :

"ఇంద్రశిలక్రిమిరోగాలనన్నిటిని పోగొట్టగలదు. శనగలను రాతిమీద నూరినట్లు ఈ శిలతో నా శరీరంలోని రోగాలనన్నింటిని చూర్ణం చేస్తాను. క్రిములుకొన్ని కంటికి కనపడతాయి; కొన్ని కంటికి కనపడవు, వలవేసి పట్టినట్టు పట్టి వాటినన్నింటిని నాశనం చేస్తాను. పేగుల్లోను, శిరస్సులోను, మడమలలోను, ఉండే క్రిములనుఈ మంత్రంతో నాశనం చేస్తాను. కొండల్లో ఉండే క్రిములు పుండ్ల ద్వారా అన్న పానీయాలద్వారా మనలో ప్రవేశిస్తున్నాయి. వాటి ఉత్పత్తినే నేను అరికడతాను (2.31).

**విరిగిన ఎముకలను కలపడమెలా?**

ఆయుధాలవల్ల శరీరావయవాలు తెగిపోయినప్పుడు, రక్తం ప్రవాహంలాగా కారిపోతునప్పుడు, ఎముకలు విరిగిపోయినప్పుడు "రోహిణ్యసి" (4-12) అనే సూక్తంతో అభిమంత్రించిన లక్కనీళ్లతో ఆ భాగాలను ఉష:కాలంలో తడపాలి. అలా చేస్తే తెగిన అవయవాలు, ఎముకలు అతుక్కుంటాయి.

**ఓ జ్వరమా! వెళ్లిపో!**

జ్వరం తగిలినప్పుడు కలిగే బాధలను వివరిస్తూ, అలాంటి జ్వరం మమ్ములను వదిలి దూరంగా పోవాలని "అగ్ని స్తక్మానం" అనే సూక్తంతో అభిమంత్రించిన జావను రోగికి తాగించే వారు. పధ్నాలుగు మంత్రాలుగలఈ సూక్తంలో జ్వరస్వరూపం ఎంతో చక్కగా వివరింపబడింది. ఉదాహరణకు చూడండి:

" ఓ జ్వరమా ! నీరసమనే సోదరునితోను, దగ్గనే చెల్లెలితోను, దురద అనే దాయాదితోను కలిసి ఇక్కడినుంచి దూరంగా వెళ్లిపో!"

**స్త్రీవశీకరణం:**

ఈ సంహితలో చాలాచోట్ల స్త్రీవశీకరణపద్ధతి చెప్పబడింది. కానీ ఆరవకాండలో ఎనిమిదవసూక్తంలో పేర్కొన్న పద్ధతి ఎంతో ఆకర్షణీయంగా ఉన్నది. చూడండి :

“తమలపాకు తీగె తనకాశ్రయమైన చెట్టునెలా కౌగిలించుకుంటుందో, అలా నీవు నన్ను కౌగలించుకో ! నీవు నన్నే ప్రేమించి నాదగ్గరే ఉండేటట్లు ఇంకోచోటికి పోకుండా చేసుకొని ఈ ప్రయోగంద్వారా నిన్ను వశపరుచుకొంటున్నాను.

ఈ అదర్వ సంహితలో మొదటి నుంచి పందొమ్మిదవ కాండవరకు అనేకమైన అభిచార కర్మలు, ఎన్నో లౌకికవిషయాలు ప్రతిపాదింపబడి చివరికాండలో మాత్రం యజ్ఞయాగాలకు సంబంధించిన ఎన్నో విషయాలు చెప్పబడ్డాయి. భౌతికదృష్టితో పరిశోధనచేసే ఈనాటి పరిశోధకులకు అథర్వవేదం ఒక గనిలాంటిది. అందులో ఎన్నో రహస్యాలు, సమాజకల్యాణానికి అనుసరింపవలసిన పద్ధతులు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. వాటిని అర్థంచేసుకొని ఉపయోగించుకోవడం, దానిద్వారా లోకకల్యాణాన్ని సాధించడం బుద్ధిమంతులకర్తవ్యం.

# విదేశీయుల వేదపరిశీలన

భారత దేశం విదేశీయులపాలనలో ఉన్నపుడు పాశ్చాత్యులు వేదాన్ని స్వప్రయోజనంకోసమే అయినా - అధ్యయనం చేశారు. అలా అధ్యయనం చేసిన వారిలో 'మాక్స్‌ముల్లర్' ముఖ్యులు. అతని అధ్యయనానికి ఆనందించిన భారతీయ మేధావులు అతన్ని 'మోక్షమూలరుడు' అని కూడా అన్నారు. మోక్షమూలరుడు వేదాన్ని గురించి అన్న మాటలివి:

" What can be more tedious than the Veda, and yet, what can be more interesting, if once we know that it is the first word spoken by the Aryan man ?"

"The Veda has a two-fold interest: it belongs to the history of world and to the history of India... As long as man continues to take an interest in the history of his race, and as long as we collect in libraries and museums the relics of former ages, the first place in that long row of books which contain the records of the Aryan branch of mankind, will belong for ever to the Regveda."

"వేదంకన్నా విసుగు కలిగించేది ఏది? అయినా ఇది ఆర్య మానవుని తొలినోటి మాట అని తెలుసుకొన్నపుడు వేదానికన్నా ఆసక్తికరం అయింది మాత్రం ఏది?

వేదానికి రెండురకాలఆసక్తి-ప్రయోజనం ఉంది. వేదం భూగోళచరిత్ర-భారతచరిత్ర అగును. మానవుడు తన జాతి చరిత్రలో ఆసక్తుడైనంతకాలం అతడు గత కాలంకోసం గ్రంథాలయాలను, ప్రదర్శనశాలలను, అవశేషాలకొరకూ అన్వేషిస్తూనే ఉంటాడు. అలాంటి అన్వేషణలో-గ్రంథపరంపరలో-నిరంతరం దర్శనం ఇచ్చేది ఋగ్వేదం, మానవులలో ఆర్యులకు సంబంధించిన సమస్త వృత్తాంతం ఋగ్వేదంలో నిక్షిప్తం"

**జీన్ లీ ఇలా వ్యక్తపరిచారు:**

"Precious or durable materials-gold, silver, bronze, marble, onyx or granite - have been used by most ancient people in an attempt to immortalize their achievements. Not so, however, with the ancient Aryas. They turned to what may seen the most volalite

insubstantial of all - the spoken word-and out of this bubble of air fashioned a monument which more than thirty, perhaps forty, centuries later stands untouched by time or the elements. For the pyramids have been eroded by the desert wind, the marble broken by earth quakes, and the gold stolen by robbers, while the Veda remains recited daily by an unbroken chain of generations, travelling like a great wave through the living substance of mind."

'అత్యంత పురాతన నరుల్లో అనేకులు-తమ విజయాలను శాశ్వత పరచడానికి, విలువైన మన్నికగలబంగారం- వెండి- కంచు- పాలరాయి- నల్లరాతిని వాడారు. సనాతన ఆర్యులు మాత్రం భిన్నంగా వ్యవహరించారు. వారు త్వరగా చెరిగే, అస్థిరరూపంగలఅక్షరాన్ని-శబ్దాన్ని-ఎన్నుకున్నారు. ఆర్యులు ఈ గాలిబుడగతో తీర్చిదిద్దిన నిర్మాణం ముప్పది, నలుబది శతాబ్దాలతరువాత కూడా కాల, ప్రాకృతిక ప్రభావాలకు అతీతంగా చెక్కుచెదరక నిలిచి ఉంది. పిరమిడ్లు ఎడారి గాలులకు తరిగిపోయాయి. పాలరాతి కట్టడాలు భూకంపాలకు కూలిపోయాయి. బంగారం దొంగలపాలైంది. వేదగానం మాత్రం నిత్యం, నిరంతరం తరతరాలుగా వినిపిస్తున్నది. ఆ వేదస్వరం మేధస్సు యొక్క సజీవ పదార్థంగా-అలలుగా, తరంగాలుగా పయనిస్తూనే ఉంది.'

ఇంతటి అక్షయ, అనంత, అవినాశ, అమృత వేదసంపద ఉన్నందుకు భారతీయులుగా మనం గర్వించాలి.

# కాలం

భారతీయులు పరమాణువునుంచి ప్రళయం దాకా కాలానికి లెక్కలు కట్టారు. పరికించండి.

సృష్టిలో అతి సూక్ష్మపదార్థం పరమాణువు.

2 పరమాణువులు-1 అణువు

3 అణువులు- ఒక త్రసరేణువు

3 త్రస రేణువులు-ఒక తృటి

100 తృటులు-1వేధ

3 వేధలు-ఒక లవం

3 లవములు-ఒక నిమేషం-ఇది మనం వాడుతున్న మినిట్ నిమిషం కాదు. ఇది సెకెనులో 16/75వ భాగం

3 నిమేషములు-ఒకక్షణం

5 క్షణాలు-1కాష్ట

10 కాష్టలు-ఒక లఘువు

15 లఘువులు-ఒక గడియ

ఏడున్నర గడియలు-1జాము

8 జాములు-ఒక రోజు

15 రోజులు-ఒక పక్షం

2 పక్షాలు-ఒక నెల

2 నెలలు-ఒక ఋతువు

3ఋతువులు-ఒక అయనం

2 ఉత్తర, దక్షిణాయనములు-ఒక మానవ సంవత్సరం

17,28,000 సంవత్సరాలు-కృతయుగం

12,96,000 సంవత్సరాలు-త్రేతాయుగం

8,64,000 సంవత్సరాలు - ద్వాపరం

4,32,000 సంవత్సరాలు కలియుగం.

4 యుగాలమొత్తం కాలం 43,20,000 సంవత్సరాలు.

సృష్టికాలం 1000x4 యుగాలు=4 కోట్ల 32 లక్షలసంవత్సరాలు

4000 యుగాలతరువాత ప్రళయం. 4000 యుగాలకాలం సృష్టి ఉండదు. తరువాత మళ్ళీ సృష్టి మొదలు.

సృష్టి ఆది నుండి ప్రమాది సంవత్సరం -1999-2000 వరకు 195,58,85,100 సంవత్సరాలు.

కలియుగంలో గడచిన సంవత్సరాలు-100.

పాశ్చాత్యులకాలం సొంతం లెక్కించిన ఇప్పటికి 2010 సంవత్సరాలే! వారు వ్రాసిన చరిత్ర 5000 సంవత్సరాలు దాటదు. వారికి కలియుగం మాత్రమే తెలుసు!

యూరోపు చరిత్ర సొంతం వందల వేల సంవత్సరాలదే! అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలచరిత్ర వందలయేళ్లదే! పాశ్చాత్యులుకొలతలతో వేదకాలాన్ని కొలవడం గజంబద్దతో ఆకాశాన్నీ-బకెటుతో సముద్రాన్నీ కొలవడంలాంటిది.

# మన ప్రాచీన సైన్స్ గ్రంథాలు

వేద కాలం నుండే మన దేశంలో అనేక శాస్త్రాలఅధ్యయనం జరిగింది. అనేక విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు వెల్లివిరిశాయి. వాటిలో కొన్ని.

| గ్రంథం పేరు | రచయిత | విషయాలు |
|---|---|---|
| 1. అక్షరలక్ష | వాల్మీకి | రేఖాగణితం, బీజగణితం, త్రికోణమితి, భౌతిక గణిత శాస్త్రం మొదలైన 325 రకాలగణిత ప్రక్రియలు, ఖనిజశాస్త్రం, జల(యంత్ర) శాస్త్రం, భూగర్భ శాస్త్రం గాలి,ఉష్ణం, విద్యుత్తులను కొలిచే పద్ధతులు. |
| 2. శబ్ద శాస్త్రం | కండిక ఋషి | సమస్త చరాచర పధార్థాలధ్వనుల్ని, ప్రతిధ్వనుల్ని గూర్చి చర్చించింది. యాంత్రికంగా ధ్వనుల్ని ప్రతి సృష్టించడం, వాటి స్థాయి, వేగాలను కొలవడం. |
| 3. లక్షణ శాస్త్రం | శకటాయన ఋషి | చైతన్య, జడ సృష్టులలింగ నిర్ధారణ శాస్త్రం. |
| 4. కన్యా లక్షణ శాస్త్రం | బభ్రుముని | ఈ శాస్త్రంలో సౌశీల్యాది విషయాలను నిర్ధారించే విధానాలు. |
| 5. శకునశాస్త్రం | గర్గముని | పక్షులధ్వనులను బట్టి, మనుష్యులమాటలను బట్టి శుభాశుభములను నిర్ణయించే విధానాలు. |
| 6. శిల్పశాస్త్రం | కశ్యప ఋషి | గుళ్ళు, రాజభవనాలు, చావడులు మొదలైన వాటి నిర్మాణం |
| 7. సూపశాస్త్రం | సుకేశ | వ్యంజనాలు, ఊరగాయలు, మిఠాయిలు, కేకులు, పిండి వంటలు. |
| 8. మాలినీ శాస్త్రం | ఋష్యశృంగ | పూలగుత్తులు, పూలతో వివిధ రకాల శిరోలంకరణలు, గుప్త భాషలో పూరేకుల మీద ప్రేమ సందేశాలు. |
| 9. కాలశాస్త్రం | భగవాన్ కార్తికేయ | కాలం, కాలవిభజన, శుభ-అశుభ కాలాలు వాటి అధిదేవతలు. |
| 10. సాముద్రిక శాస్త్రం | సముద్రుడు | హస్తరేఖా శాస్త్రం, శరీరం పై ఉన్న ముద్రలు ఇతర విషయాలు |

| గ్రంథం పేరు | రచయిత | విషయాలు |
|---|---|---|
| 11. ధాతుశాస్త్రం | అశ్వనీకుమార | సహజ, కృత్రిమ ధాతువులను గూర్చి, మిశ్ర ధాతువులు, ధాతువుల రూపాంతరణ, రాగిని బంగారంగా మార్చడం. |
| 12. విషశాస్త్రం | అశ్వనీకుమార్ | 32 రకాలపదార్థాలు వాటి గుణాలు, తయారీ, ప్రభావాలు, విరుగుళ్లు. |
| 13. చిత్ర కర్మ శాస్త్రం | భీమ | 200 చిత్ర లేఖన ప్రక్రియలను గురించి ఒక వ్యక్తి యొక్క తలవెంట్రుకలను గాని, గోటిని గాని ఎముకను గాని చూసి ఆ వ్యక్తి బొమ్మను గీసే ప్రక్రియ. |
| 14. మల్లశాస్త్రం | మల్ల | కసరత్తులు, క్రీడలు, 24 రకాలయుద్ధ విద్యలు |
| 15. పరకాయ ప్రేశం | వాలఖిల్య | ఒక శరీరాన్ని వదలి ఇంకొక శరీరంలోనికి ప్రవేశించడం, 32 రకాల యోగ విద్యలు అణిమాద అష్ట సిద్దులు. |
| 16. అశ్వ శాస్త్రం | అగ్ని | గుర్రములు, వాటికి సంబంధించిన శుభాశుభ చిహ్నాలు, దేహధర్మాలు, ఈనడం, తర్ఫీదు. |
| 17. గజశాస్త్రం | కుమారస్వామి | ఏనుగులశరీర లక్షణాల్ని పరీక్షించడం ఇంకా అనేకం |
| 18. రత్న పరీక్ష | వాత్సాయన ఋషి | రత్నాల24 లక్షణాలు, కృత్రియ రత్నాలు, వాటి రూపములు, బరువు మొదలైనవి. |
| 19. మహేంద్ర జాల శాస్త్రం | సుబ్రహ్మణ్య స్వామి | నీటిపై నడవడం, గాలిలో తేలడం వంటి భ్రమలు కల్పించడం. |
| 20. అర్థశాస్త్రం | వ్యాస | 3 భాగాలు. 82 ధనసంపాదనా విధానాలు, (ధర్మబద్ధమైనవి). |
| 21. శక్తి తంత్రం | అగస్త్య | మూలప్రకృతి, మాయ, సూర్యుడు, చంద్రుడు, గాలి, అగ్ని మొదలగు వాటి 64 రకాలబాహ్యశక్తులు వినియోగాలు అణువిచ్ఛే దనం. |
| 22. సౌదామినీకళ | మతంగ ఋషి | నీడలద్వారా, ఆలోచనాలద్వారా సమస్త దృగ్గోచరం పర్వతాల అంతర్భాగాలభూమి అంతర్భాగాలఛాయ చిత్రాలు తీసె ప్రక్రియ. |

| గ్రంథం పేరు | రచయిత | విషయాలు |
|---|---|---|
| 23. మేఘశాస్త్రం | అత్రిముని | 12 రకాలవర్షాలు, 64 రకాలమెరుపులు, 33 రకాలపిడుగులు. |
| 24. యంత్రశాస్త్రం | భరద్వాజ | భూమి పై (339), నీటిపై (783), గాలిలో (101) చరించడానికి మొత్తం 1223 రకాలవాహనాలు. తంత్ర కృత్రిమవిధానాలతో సాధ్యమయ్యేవి. |
| 25. స్థాపద్యవిద్య | అదర్వణ వేదం నుండి | ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, కట్టడములు, నగర ప్రణాళిక మొదలగు సమస్త నిర్మాణాలు. |
| 26, ఆయుర్వేదం | బ్రహ్మ అశ్వినీ దేవతలు, అత్రి, అగ్ని వేశాదులు, చరకుడు, వాగ్భటుడు, శుక్రుడు | ఔషదాలు, శస్త్రచికిత్స, ఇంజక్షన్లు |
| 27. ధనుర్వేదం | విశ్వామిత్ర | చక్రం, కత్తి, బాణం అనేక ఇతర ఆయుధాలు బ్రహ్మాస్త్రం, వైష్ణవాస్త్రం, పాశు పతాస్త్రం ఆగ్నేయాస్త్రం, మంత్రాలు, ఆయుధాల వర్ణన |
| 28. గాంధర్వవేదం | నందికేశ్వర, నారద, హనుమ, భరతముని | గాత్ర-వాద్యసంగీతాలు, నృత్యం ఇందులోని భాగాలు. భగవదర్చనతో మానసిక తాదాత్మ్యం పొందడం. |

# పంచమ వేదమైన మహాభారత సంక్షిప్త గాథ

1. దక్ష ప్రజాపతి కూతురైన అదితిని కశ్యపుడు వివాహం చేసుకున్నాడు. అతనికి వివస్వంతుడనే కుమారుడు.
2. వివస్వంతునికి ముగ్గురు పుత్రులు, ఇద్దరు పుత్రికలు, వారిలో పెద్ద వాడు వైవస్వత మనువు (ఇతని మనుధర్మ శాస్త్రం వల్లనే మానవులు నీతి మంతులయ్యారు).
3. మనుమహారాజు కూతురులలో ఇలా అనే సౌందర్యవతిని బుధుడుసంగ్రహించడం వల్లజన్మించినవాడు పురూరవుడు.
4. దేవ కన్యయైన ఊర్వశి పురూరవ చక్ర వర్తిని వరించింది. వారిద్దరి ఆరుగురు కొడుకులలో ఆయువు పెద్దవాడు.
5. ఆయువు ఐదుగురుపుత్రులలో పెద్దవాడైన సహుషుడు సార్వభౌముడై సప్త ద్వీప పరివృతమైన భూమండలాన్ని చిరకాలం పాలించాడు.
6. ఆ మహారాజు పుత్రులలో పెద్దవాడైన యయాతి రాజేంద్రుడు శుక్రుని కూతురైన దేవయానిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు దేవయాని వివాహంకన్న ముందు, సంజీవిని విద్యను శుక్రుని నుండి అపహరించాలనివచ్చిన బృహస్పతి కుమారుడు, అంగీరసుని మనవడు ఐన కచునిప్రేమిస్తుంది.అతడు ప్రేమను నిరాకరించగా, అతడిపై మమకారం చావక దేవయాని కచుని శపిస్తుంది దేవయాని యయాతులకు యదుడు, తుర్వసుడు అనే పుత్రులు కల్గుతారు. రాక్షస చక్రవర్తి ఐన వృషపర్వుని కూతురు శర్మిష్ఠను రెండవ రాణిగా స్వీకరించి యయాతి ద్రుహ్యుడు, అనుడు, పూరులనే పుత్రులను పొందుతాడు. తర్వాత యయాతి రాజేంద్రుడు పూరున్ని రాజును చేస్తాడు.
7. పూరుడు అనేక సంవత్సరాలు ధర్మంగా పరిపాలన చేస్తాడు
8. ఆ తర్వాత మతినారుడు పట్టాభిషిక్తుడౌతాడు. మతినారుడు సరస్వతిని వివాహమాడి నీలుడు. అనే బాలునికి జన్మనిస్తాడు.

9. నీలుడు రంధంతర అనే రాజకన్య ద్వార (వివాహం) దుష్యంతుడనే పుత్రుని పొందుతారు.

10. దుష్యంతుడు శకుంతలను వివాహమాడగా భరతుడు, జన్మిస్తాడు. ఇతని వల్లనే భరతవంశం (చంద్రవంశం) భరతభూమి యేర్పడింది.

11. ఆ తర్వాత హస్త (ఇతని వల్లనే హస్తినాపురం ఎర్పడింది) అనే మహారాజు పరిపాలించాడు.

12. అనంతరం సాహసంలో సద్గుణంలో, ఔదార్యంలో, ధైర్యంలో మేటి వారనిపించుకున్న వారు చంద్ర వంశంలో చాలమంది వెలిశారు. వారిలో సవరణుడు సూర్యుని పుత్రియైన తపతీదేవిని వివాహమాడి కురుడు అనే మహావీరుని పొందాడు.

13. చంద్రవంశ శ్రేష్ఠుడైన ప్రతీప మహారాజు గంగా దేవిని కోడలుగా చేసుకుంటానని వాగ్దానం చేస్తాడు. సత్యలోకంలోబ్రహ్మ మరియు ఇంక ఎంతో మంది ఎదుట గంగాదేవి (యొక్క) చీర గాలికి తొలగగా ఆమె తొడలను చూడకుండా, అందరు తల త్రిప్పకోగా ఇక్ష్వాక వంశతిలకుడైన మహాభిషుడు చూస్తాడు అపుడు బ్రహ్మ భూలోకాన జన్మించు అని శపిస్తాడు. మహాభిషుడు వేడుకోగా ప్రతీపమహారాజు పుత్రునిగా జన్మించి మళ్ళీ ఇచటికి చేరుకుంటావు అంటాడు.

14. ప్రతీప మహారాజు పుత్రుడుగా మహాభిషుడు శంతనుడనేనామంతో జన్మించి గంగా దేవిని పెండ్లి చేసుకుంటాడు. గంగాదేవి తనేం చేసిన ఏమి ఎదురు చెప్పవద్దని అలాజరిగిన పక్షంలో క్షణంలో వారిద్దరి సంబంధం తెగి పోతుందనే షరతుపై పెండ్లి చేసుకుంటుంది. ఏడుగురు పుత్రులను గంగాదేవి గంగలో కలిపివేసింది. ఎనిమిదవ పుత్రుని చంపవద్దని రాజు శాసించగా గంగాదేవి షరతుప్రకారం వెళ్ళిపోతూ, తను పుత్రులను గంగలో కల్పడానికి కారణం ఇలా వివరించింది.

15. తను (గంగాదేవి) సత్యలోకంనుండి వస్తుండగా తనకు అష్టవసువులు ఎదురై తమను పుట్టిన వెంటనేగిట్టించమని (ఒక చిన్న వసువుని తప్ప ) ప్రార్థించినారని తెల్పింది. అష్టవసువులు భార్యలతో సహా భూలోకవనాల్లో

విహరిస్తు వశిష్ఠుని పెంపుడు ధేనువును, చిన్న వసువు అన్నలు ప్రేరేపించగా, భార్య కోరగా మెడకు ఉచ్చు బిగించి లాక్కురావడానికి ప్రయత్నించాడు. అప్పుడు వశిష్ఠుడు, అష్టవసువులను భూలోకంలో సర్వభ్రష్ఠులై సంతాన హీనులై జన్మించమని శపించి, మళ్ళీ ప్రార్థించగా పెద్దవారైన ఏడుగుర్ని గంగా దేవితో చెప్పి పుట్టిన వెంటనే గిట్టించ మని ప్రార్థించమనండి, చిన్న వసువు చాలగొప్ప కీర్తివంతుడౌతాడు అంటాడు.

16. ఆ విధంగా వివరించిన గంగాదేవి అట్టి ఎనిమిదవ పుత్రు (దేవవ్రతుడు)ని ఆరి తేరిన వీరాధి వీరునిగా తీర్చిదిద్ది భూలోకంలో అప్పగిస్తానని బాలునితో సహా అంతర్ధానమౌతుంది. పదునెనిమిదేండ్ల తర్వాత కుమారుడైన దేవవ్రతుని (భీష్ముడు) వీరాధి వీరునిగా తీర్చిదిద్ది గంగా దేవి శంతనునికి అప్పగించినది.

17. పరాశర మహర్షి పడవనడుపుకునే దాశరాజు కూతురైన సత్యవతి (యోజనగంధి)ని పడవలో (ఇది భగవన్నిర్ణయం)  పొందుకోరగా, తన లాంటి బెస్తదానిపై కోరిక ఎందుకని సత్యవతి అడుగగా, ఆమె బెస్తకన్య కాదని ఆమె పుట్టుక మహారాజు వల్లే జర్గిందని ఇలా చెబుతాడు.

18. చేదిదేశాన్ని వసు మహారాజు (ఉపరిచర మహారాజు) పరిపాలిస్తుంటాడు. ఆ కాలంలో కోలాహలుని వల్ల శుక్తమతికి కల్గిన వీని పదుడు, గరికను రాజుకు కానుకగా సమర్పిస్తారు. అపుడు మహారాజు వసుపదున్ని సైన్యాధ్యక్షుడుగా, గిరికను అర్థాంగిగా చేసుకొన్నాడు.పుష్పవతి ఐన గిరికకు మృగమాంసం స్వయంగా తెచ్చిపెట్టడానికి అడవికి వెళ్ళిన మహారాజు స్వప్న జగత్తులో భార్యను, బిగికౌగిట పొదవినట్లు ఊహించగా వీర్యస్కలనం అవుతుంది. దానిని ఒక దొప్పలో పట్టి ఒక గ్రద్దకు ఇచ్చి గిరికా దేవికి చేరవేయమంటాడు. త్రోవలో ఇంకొక గ్రద్ద మాంసం అనుకోని దొప్ప కోసం కొట్లాడగా దానిలోని వీర్యం నదిలో పడుతుంది. అపుడు అచట శాపవశాత్తు చేపయై పడిఉన్న అద్రిక అనే దివిజ కాంత, తన ముందు వీర్యం పడడంవల్ల మ్రింగగా ఆమె గర్భవతి ఔతుంది అట్టి చేపను జాలరులు పట్టి దాశరాజుకప్పగించగా, చేప కడుపును చీల్చగా అద్రిక శాపంతీరి తన లోకానికి వెళ్ళి పోతుంది. కడుపునుండి ఇద్దరు పిల్లలు వెడలి ఒకరు మత్స్య రాజుగా ఇంకొకరు

సత్యవతిగా (అపురూపయువతిగా) అయ్యారు.

19. పరాశర మహర్షికి సత్యవతి సంగమంవల్ల దివ్యతేజోమూర్తియైన బాలుడుదయించి వెంటనే నవయవ్వనుడై (కృష్ణ ద్వైపాయనుడు) కోరుకున్నప్పడు వచ్చి దర్శనం చేసుకుంటానని తల్లికి చెప్పి (దండం, కమండలకృష్ణాజలం పుట్టుకతోనే సిద్ధించాయి) తపస్సు చేసుకొనుటకై అంతర్ధానుడైనాడు. ఆ సంగమ సమయంలో పరాశరమహర్షి సత్యవతికి కన్యాత్వం చెడకుండా యోజనం దూరం వరకు సువాసనలు వెదజల్లేట్లు మరియు ఆసమయమున పట్టపగలు ఐనను పున్నామినాటి రాత్రిగా మారేట్లు వరాలు ఇస్తాడు.

20. తర్వాత శంతన మహారాజు సత్యవతిని ప్రేమిస్తాడు. అపుడు సత్యవతి తండ్రి ఐన దాశరాజు సత్యవతికి పుట్టిన వారిని యువరాజుగాచేస్తే తప్ప తన కూతురును ఇచ్చి వివాహం చేయనని చెప్పగా దేవవ్రతుని (భీష్ముడు)కి అన్యాయంచేయలేక సత్యవతిని మర్చిపోలేక శంతనుడు మనోవ్యధతో ఉంటాడు. తండ్రి మనోవ్యధ కారణం దేవవ్రతుడు తెల్సుకొని దాశరాజు వద్దకు వెళ్ళి తాను సింహాసనాన్ని కోరనని, పుత్రులు కాకుండ తండ్రికొరకు తను పెండ్లియే చేసుకోనని భీష్మమైన ప్రతిజ్ఞ (ఈ భీష్మ ప్రతిజ్ఞవల్లే ఇతడు భీష్ముడయ్యాడు) చేసి సత్యవతిని శంతనునికిచ్చి వివాహం చేశాడు. శంతనుడు కుమారుని త్యాగానికి మెచ్చి తన సర్వశక్తులు దారపోసి స్వచ్ఛంద (తను కోరుకున్నప్పడు) మరణం వరం భీష్మునికి అనుగ్రహిస్తాడు.

21. శంతన సత్యవతులకు చింత్రాంగదుడు, విచిత్ర వీర్యుడు అనే కుమారులు కల్గుతారు. చిత్రాంగదుడు గంధర్వులను దూషించి బలై పోతాడు. కాశీరాజు స్వయంవర ఆహ్వానం తమ్ముడైన విచిత్ర వీర్యునికి పంపలేదని భీష్ముడు స్వయంగా స్వయంవర మంటపానికి వెళ్ళి కాశీరాజు ముగ్గురు పుత్రికలను రథం పై ఎక్కించుకొనితీసుకురాగా, అందులో ఒక పుత్రిక ఐన అంబదేవి సాళ్వుడనే అతనిని ప్రేమించానంటే ఆమెను సాళ్వుని దగ్గరకు పంపుతాడు, ఇతర ఇద్దరుపుత్రికలైన అంబిక, అంబాలికలను విచిత్రవీర్యునికి వివాహం చేస్తాడు. కాని కొన్ని రోజులకే విచిత్ర వీర్యుడుమరణిస్తాడు. అపుడు సత్యవతి, వంశం ఇక అంతరించిపోతుంది

భీష్మా, ప్రతిజ్ఞ చాలించి నీవు అంబిక అంబాలికలను పెళ్లి చేసుకొమ్మని అనగా, భీష్ముడు అది జర్గని పని అమ్మా అని ఐతే వంశం అంతరించి పోతున్న సమయంలో పుత్రులకొరకు బ్రాహ్మణులచేతనైనా లేక మరదులచేతనైన పుత్రవతులను చేయవచ్చని ధర్మశాస్త్రములు చాటుచున్నావని, చెప్పాడు.

22. సత్యవతి భీష్ముని అనుజ్ఞపై తన మొదటి కుమారుడైన వ్యాసుని (అంబ అంబాలిక లకు బావ) స్మరించి అంబికను వ్యాసునితో కల్పుతుంది. ఐతే అంబిక భయంచే కళ్ళు మూసుకోవడం వల్ల అంధుడైన దృతరాష్టుడు జన్మిస్తాడు. అంబాలిక వ్యాసులకు పాండురాజు జన్మిస్తాడు. ఇంకొక మంచి పుత్రుని అంబికకు అనుగ్రహించమని సత్యవతి వ్యాసుని కోరగా అంబిక భయపడి తన దాసిని తోలించగా. ఆమెకు వ్యాసుని వల్ల విదురుడు పుడతాడు (మాండవ్యునికి అన్యాయంగ శిక్షవేయడం వల్ల అతడు యమధర్మరాజును భూలోకంలో దాసీపుత్రుని (విదురుడు) వై జన్మించమని శపిస్తాడు).

23. సత్యవతి దృతరాష్టునిపెండ్లి విషయమై విచారపడగా భీష్ముడు నూర్వురిని వివాహం చేస్తానని, సుబలుని జేష్టపుత్రిక గాంధారితో సహా పదకొండు మందిని దృతరాష్టునికివ్వాలని కబురంపగా సుబలుడు కొడుకు శకునితో పుత్రికలతో వచ్చి అందరని వివాహం చేస్తాడు. భీష్ముడు వేరేవారిని తెచ్చిమొత్తం నూర్వురిని దృతరాష్టునికి ఇచ్చి పెండ్లి చేస్తాడు.

24. కుంతిభోజుడు మేనమామ కొడుకగు శూరుని బిడ్డయగు పృథా (కుంతీ) దేవిని దత్తత తీసుకొని స్వయంవరం ప్రకటించగా పాండురాజును ఎన్నుకొంటుంది. రెండవ భార్య మద్రరాజ పుత్రియైన మాద్రిని భీష్ముడు పాండురాజుకు భార్యను చేస్తాడు. పాండురాజు భూపాలకులందరిని జయించి దృతరాష్టునిచే నూరు అశ్వమేధయాగాలు చేయించాడు.

25. కిందముడనే మహర్షి భార్యతో హరిణ దంపతులుగా మారి క్రీడిస్తుండగా పాండు రాజు బాణంతో ఆడ లేడిని (కిందముని భార్యను) చంపగా కిందముడు భార్యతో సంగమిస్తే మరణిస్తావని పాండురాజుకు శాపం పెడతాడు.

26. పాండురాజు అనుమతిపై కుంతీ దుర్వాసమహాముని ఉపదేశించిన మంత్రంచే ధర్మ దేవుని ఆరాధించి ధర్మరాజును, వాయుదేవుని వల్ల భీమసేనుని ఇంద్రుని వల్ల అర్జునులకు జన్మ ఇస్తుంది. ఈ విధంగా ముగ్గురు పాండువులు శుభశకునాలతో జన్మిస్తారు.

27. కుంతీ దేవికి దైవాంశ సంభూతుడైన పుత్రుడు తనకన్నా ముందు కల్గాడని అసూయతో గాంధారి తన గర్భాన్ని చేతులతో ఒత్తిడి కల్గించగా పిండం బయటకు వస్తుంది. సత్యవతిచే స్మరించ బడిన వ్యాసుడు ఆ పిండాన్ని నూటావొక్క భాగాలుగా విభజించి నేతికుండలలో ఉంచమంటాడు. భీముడు జన్మించిన రోజుననే మొదటి నేతికుండనుండి దుర్యోధనుడు అశుభశకునాలతో జన్మిస్తాడు ఆ రోజునుండి రోజుకొకరు చొప్పన నూరుగురుపుత్రులు ఒక పుత్రిక జన్మిస్తారు. మరియు దృతరాష్టుడు వైశ్య అనే పత్నియందు యుయుత్సుడు అనే మరో కుమారుణ్ణి పొందాడు.కుంతీదేవి దుర్వాస మహాముని మంత్రం మాద్రికి ఉపదేశించగా మాద్రి అశ్వినీ దేవతలను ప్రార్థించి నకులుడు, సహదేవుడు అనే బాలకులను ప్రసవిస్తుంది.

28. పాండు రాజు భార్యలతో శతశృంగ పర్వతం పైననే ఉంటున్నాడు. (వసుదేవుడు తన పురోహితుడైన కశ్యపుని పాండురాజుతో ఉండమని పంపిస్తాడు. అతడు అచటనే ఉండిపోతాడు. ఒకనాడు రెండవ భార్యయైన మాద్రిని ఉద్రేకంలో అనుభవించగా కిందమునిశాపం వల్ల పాండురాజు మరణిస్తాడు. కశ్యపుడు కుంతీ, పాండవులను రాజ్యానికి తీసుకువచ్చి, పాండురాజుమరణవార్త తెలుపగా అందరూ దు:ఖించారు. భీష్ముడు అనేక దానధర్మాలు చేశాడు.వ్యాసుని ప్రేరణవల్ల సత్యవతి కోడండ్రతో (అంబికా, అంబాలికా) తపోవనానికి వెళ్ళి ఘోరమైన తపస్సు చేసి పుణ్యలోకాలకు చేరుకున్నారు. భీష్ముడు వారిపేరదానధర్మాలు చేయించాడు.

29. భీష్మునికి పాండవులపై ప్రేమ ఎక్కువని, వారు చాలా అందంగా, బలిష్టంగా ఉన్నారని దుర్యోధనాది కౌరవులు అర్థంలేని ద్వేషంపెంచుకొని భీముని చంపించుటకు ఎన్నో విధాలప్రయత్నాలు చేసి విఫలులైనారు. పాండవ కౌరవులకు కృపాచార్యులు గురువు. ద్రోణుడు బావిలో పడిన బంతిని

బాణాలద్వార తీసి, తన చాతుర్యాన్ని చూపించి తన జన్మవృత్తాంతంచెబుతూ, దివ్యత్వాన్ని పొందిన భరద్వాజమహర్షి ఘృతాచి అనే అప్సరస జలక్రీడలాడుతుండగా చూచి స్కలించిన వీర్యాన్ని ద్రోణ పత్రపుటంలో పట్టి ఉంచగా కొన్నాళ్లకు దానినుండి తాను పుట్టానని, అగ్నవేశుని వద్ద విద్యలు నేర్చుకొని కృపాచార్యుని చెల్లెలైన 'కృప'ని వివాహమాడి అశ్వత్థామనుపొందానని చెప్పాడు. భీష్ముడు కౌరవపాండవులకు ద్రోణుని ప్రధాన ధనురాచార్యులుగా నియమించి భార్యాపిల్లలతో అచటికి వచ్చి ఉండమన్నాడు. ద్రోణుడంగీకరించాడు.

30. ఏకలవ్యుడనే ఎరుకలకులమునకుచెందిన వ్యక్తి ద్రోణుని శిష్యరికం కోరగా అతను నిరాకరిస్తాడు అప్పడు ఏకలవ్యుడు ద్రోణుని విగ్రహం ముందుంచుకొని సకలవిద్యలను నేర్చుకొని శబ్దవేది విద్యలో కూడ ఆరితేరిన వాడౌతాడు. ఇది తెల్సిన ద్రోణుడు ప్రపంచంలో అందరిని మించిన దనుర్విద్యానిపుణున్ని చేస్తానని అర్జునునికిచ్చిన వరం ఏకలవ్యుని వల్ల వ్యర్థం అవుతుందేమోనని, గురుదక్షిణగా ఏకలవ్యుని కుడి చేతి బొటన వ్రేలును కోరగా. సంతోషంగా ఏకలవ్యుడు సమర్పించి భ్రష్ఠ శౌర్యుడౌతాడు.

31. భీష్ముని కోరిక మేరకు కౌరవ పాండవులధనుర్విద్య ప్రదర్శన విశాలమైదానంలో ఏర్పాటు చేయగా పెద్దలంతాదాన్ని తిలకిస్తూ. అర్జునుని విద్యను వేనోళ్ల పొగిడారు.

32. ఆ సమయంలో ఒక వీరుడు (కర్ణుడు) ప్రవేశించి తన విలువిద్యను అత్యద్భుతంగా ప్రదర్శించి అర్జునుని ఎదిరిస్తానని సవాలుచేయగా, కృపాచార్యుడు కర్ణుడు సూతపుత్రుడైనందున అలాంటి అర్హత లేదంటాడు.దుర్యోధనుడు అపుడు అర్జునున్ని ఎదిరించగలిగేవాడు కర్ణుడని అతని విలువిద్య ద్వారా గ్రహించి అతన్ని తన స్నేహితునిగా చేసుకొని అపుడే కర్ణుని అంగరాజ్య పట్టాభిషిక్తున్ని చేసి, కర్ణుడు రాజైనందున అర్జునున్ని ఎదిరించే అర్హత కల్పిస్తాడు దుర్యోధనుడు. ఈ మేలుకు సహజకవచ, కర్ణకుండలధారి ఐన కర్ణుడు తన సర్వస్వం దుర్యోధనుని కొరకు త్యాగం చేస్తానని మాట ఇస్తాడు.

33. **కర్ణుని జన్మ రహస్యం:** కుంతీ దేవి కన్నెగా ఉన్నపుడు దుర్వాసుని మంత్రం పఠించి, సూర్యుడు ప్రత్యక్షం కాగా సూర్యుని వల్ల పొందిన పుత్రున్ని నీటిలో వదలగా అట్టి బాలకుడు ఒక సూతకులస్థునికి దొరుకగా అట్టి బాలకుని అతను తన భార్య రాధకి ఇస్తాడు. సంతానం లేని వారు ఆ బాలకున్ని పెంచారు అతనే రాధేయుడు (కర్ణుడు).ద్రుపద మహారాజు, ద్రోణాచార్యులు మొదట చాలా మంచి మిత్రులు. ద్రోణునికి సహాయం కావల్సి వచ్చినపుడు ఎప్పడైన తనవద్దకు రావచ్చునని ద్రుపదుడు ద్రోణునితో చెప్పినందున, ఒక రోజు తనకుమారుడైన అశ్వత్థామ కొరకు పాడి ఆవుకావల్సి వచ్చి ద్రోణుడు దృపదుని వద్దకు వెళ్ళగా, అపుడు దృపదుడు ద్రోణున్ని అవమానపరుస్తాడు. ప్రతీకారం తీర్చుకోవడానికి ద్రుపదున్ని గురుదక్షిణగా బంధించితెమ్మని తన శిష్యులైన కౌరవపాండవులను కోరగా, వేరెవరికి సాధ్యంకాకపోగా, భీమార్జునులు ద్రుపదున్ని తెచ్చి ద్రోణుని కాళ్ళపై పడేస్తారు. ద్రుపదుని ద్రోణుడు క్షమించి విడిచిపెట్టాడు. అర్జునున్ని మెచ్చుకున్నాడు.

34. దృతరాష్టుడు పాండవులను వారణావతాపురంలో ముందుగా ఏర్పరిచిన లక్కగృహంలోకి కొన్ని రోజులు ఆ ఊరిలో ఉంటే పుణ్యమని పంపిస్తాడు. విదురుని సేవకుడైన ఖననకుని ద్వార తామున్నది లక్కగృహమని దానిలో దుర్యోధనాదులు వాళ్ళను కాలబెట్టిచంపుతారని తెల్సికొన్న భీముడు కుంతీతో సహా అందరిని భూసొరంగం ద్వార తప్పిస్తాడు. దాసి స్త్రీ ఆమె ఐదుగురు కొడుకులు లక్క గృహంలో చనిపోతే వాళ్ళ శవాలను చూచి పాండవులు చనిపోయినారని వారికి వగలు ఏడ్పులతో ఉదకం విడిపించాడు దృతరాష్టుడు, తప్పించుకొన్న పాండవులు అడవులలో తిరుగుతూ పండ్లు ఫలాలు తింటూంటారు.

35. భీముడు హిడింబాసురుని చంపి అతని చెల్లెలైన హిడింబిని కుంతీ పాండవులఅనుజ్ఞపై పెండ్లాడి ఘటోత్కచుడు అనే పుత్రుని పొందుతాడు. ఘటోత్కచుడు తల్చుకున్నపుడు ప్రత్యక్షమౌతానని చెప్పి తల్లిని మూపున ఎక్కించుకొని మాయమవుతాడు. ఏక చక్రమనే పట్టణ ప్రజలు రోజుకొకరు చొప్పన బకాసురునికి ఆహారంగా పోయెడివారు. భీముడు బకాసురుని చంపి ఆ పట్టణ ప్రజలను కాపాడాడు.

36. ద్రుపదుడు యజుడనే విప్రోత్తముని ఆధ్వర్యంలో పుత్రకామేష్ఠిని ఆరంభించి అర్జునుని భర్తగా పొందగలకుమార్తె, ద్రోణుని సంహరించగలపుత్రుడు కావాలని కోరుకోగా, అలాంటి వారే అగ్నిగుండం నుండి దుష్ట-ద్యుమ్నుడు, ద్రౌపదిగా ఉద్భవించారు. కుబేరుని మిత్రుడైన అంగారపర్ణుడు అర్జునుని తన అడవిలోని కెందుకొచ్చారని ఎదిరిస్తాడు అర్జునుడు అతనిని భంగపర్చగా అంగారపర్ణుడు వారి స్నేహితుడనేనని తాను ఒక కథ చెబుతూ పూర్వం గాధిరాజు కుమారుడైన విశ్వామిత్ర మహారాజు వశిష్ఠుని కామధేనువును బలవంతంగా తీసుకుపోవుటకు యత్నించగా వశిష్ఠ ప్రభావం వల్ల నందిని ధేనువు బలంపోసు కొని భటులను చిందరవందర చేస్తుంది. అప్పుడు విశ్వామిత్రుడు క్షాత్ర తేజస్సుకన్న ఆర్ష తేజస్సు గొప్పదని భావించి ఘోరమైన తపస్సు చేసి రాజర్షియై చివరకు బ్రహ్మర్షి ఐనాడు అని చెప్పి ఉత్కచపుణ్య తీర్థం వద్దవున్న ధౌమ్యున్ని పురోహితునిగా చేసుకొండని చెప్పగా పాండవులచటికి పోయి అతనిచే పౌరోహిత్యాన్ని అంగీకరింప చేస్తారు. ధౌమ్యుడు తల్చుకున్న వెంటనే సన్నిధి చేరతానని చెబుతాడు.

37. ద్రౌపదికి ఏర్పాటు చేసిన స్వయంవరంలో మత్స్యయంత్రాన్ని కర్ణ, దుర్యోధనాది మహామహులు ఇంకా ఎందరో ఎవరు ఛేధించకపోగా అర్జునుడు ఛేధించి ద్రౌపదిని తీసికొని కుంతీ పాండవులున్న చోటకి వెళ్ళి, కుంతికి, దివ్యఫలంతెచ్చానని చెప్పగా కుంతీ ద్రౌపదిని చూడకుండ ఏదో అనుకొని ఐదుగుర్నీ సమానంగా పంచుకోమని చెబుతుంది. స్వయంవరం ఐనవెంటనే దుర్యోధనుడు తన వారికెవరికి ద్రౌపది నివ్వలేదనే కోపంగా ద్రుపదునిపై యుద్ధం ప్రకటించగా భీమార్జునులు వారిని ఓడించి, తరుముతారు. కుంతీ వాక్యం పొల్లు పోగూడదని, ఎలా అని స్వయంవరానికి వచ్చిన బలరామకృష్ణులు పాండవులు విచారిస్తూ ఉంటారు. అపుడు (స్వయం వరంలో పాండవులు బ్రాహ్మణులనే తెల్సు తర్వాత అందరికి పాండవులని తెలుస్తుంది). వ్యాసుడు ప్రత్యక్షమై ద్రౌపదిని ఐదుగురు వివాహం చేసుకుంటారు. కుంతీ వాక్యం పొల్లుపోదు ఇది ధర్మ విరుద్ధం కాదా అని అనగా ద్రౌపది ఐదుగురికంకితం కావాలని

విధిపురుషుడే నిర్ణయించాడు వినండి అని ద్రౌపది పూర్వ జన్మను వ్యాసుడు ఇలా వివరిస్తారు.

38. భయంకరమైన కుష్ఠువ్యాధి పీడితుడైన మౌద్గల్యున్ని భర్తగా ఒక సుందరి (ద్రౌపదిని) పూర్వ జన్మలో పొంది జీవితాంతం అతనిని సేవిస్తుంటే మౌద్గల్యుడు తన తపస్సంత ధారపోసి భార్య కోరిక ప్రకారం ఐదువిధాలమనోహర పురుషులరూపాలలో కొన్ని వేలసంవత్సరాలు ఆమెను తృప్తి పర్చి తపస్సు చేసి బ్రహ్మను చేరుకుంటాడు. మరుజన్మలో కాశీ రాజు కుమార్తెగా పుట్టి ద్రౌపది ఘోరమైన తపస్సు చేస్తుంది, ధర్ముడు, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్విని దేవతలు ఆ దారిన వేరువేరుసమయాలలో వెళుతూ తమఅంశలలోజన్మించేవారికి భార్యవుకమ్మని ద్రౌపదిని ఆశీర్వదిస్తారు. ఆమె తపస్సుకు ప్రసన్నుడై పరమేశ్వరుడు ప్రత్యక్షమైన వెంటనే ద్రౌపది పతిందేహి అని తొందరపడి ఐదుసార్లు అనగా పరమేశ్వరుడనుగ్రహిస్తాడు. మరియు ఒక భర్తనుండి ఇంకొక భర్తను చేరబోయే సమయంలో కన్యాత్వదూషితంకాకుండా యదాతథంగా ఉండేట్లు ఆశీర్వదిస్తాడు. కాశీరాజ పుత్రి అచటే దేహం విడచి ద్రౌపదిగా మళ్ళీ పుడుతుంది. వ్యాసుడు ఆవిధంగా చెప్పిన తర్వాత దృపదుడు ఐదుగురికి ద్రౌపదినిచ్చి మహావైభవంగా వివాహం చేస్తాడు. వివాహానికి వచ్చిన కృష్ణుడు పరివార సమన్వితుడై అచటనే ఉండి పాండవులను హస్తినాపురం పంపి ద్వారకకు వెళతాడు.

39. భీష్ముడు దృతరాష్టుని మాయోపాయాలకు కోపించి పాండవులను పిలిపించి వారి అర్థ రాజ్యం వారికిచ్చేయమని చెప్పగా దృతరాష్టుడు విదురునిద్వార పాండవులను పిలిపించి కృష్ణుని కూడా పిలిచి భీష్ముని ఆజ్ఞ ప్రకారం అర్థ రాజ్యం పాండవులకిస్తాడు. పాండవులు ద్రౌపది, కుంతి, కృష్ణ సాత్యకులతో ఇంద్రప్రస్థం చేరుకుంటారు. కృష్ణుడు ఇంద్రుని తల్చుకొని ఇంద్రుడు విశ్వకర్మను స్మరించగా విశ్వకర్మ వేదవ్యాసుడు నిర్ణయించినట్లు అత్యద్భుత నగరాన్ని నిర్మించాడు. దానికి వ్యాసుడు ఇంద్ర ప్రస్థ అని నామ కరణంచేశాడు. శుభముహూర్తంలో ధేమ్యుడు రత్నకిరీటం ధర్మరాజు శిరసున ఉంచి పట్టాభిషేకం చేస్తాడు. కృష్ణుడు వెళ్ళి పోతాడు.

40. ఒక సారి నారదుడు వచ్చి స్త్రీ మూలంగా మనస్పర్థ లేర్పడతాయని ఒక వృత్తాంతం చెబుతాడు. నికుంభుని పుత్రులు సుందోపసుందులనే రాక్షసులు ఎవరి చేత చావకుండ వరం కోరుకొని బ్రహ్మచేపంపబడిన తిలోత్తమను భార్యగా చేసుకోవాలని పరస్పర కాంక్షతో ఇద్దరు పోట్లాడి చనిపోతారు. అందువలన మీరు ఐదుగురు ఏ ఒక్కరు ద్రౌపదితో ఉంటున్న సమయంలో తక్కిన నల్గురిలో ఎవ్వరు ఆ గృహంలో ప్రవేశించినా దోషపరిహారార్థం 12 మాసాలు దాన ధర్మాలు చేస్తు తీర్థయాత్రలు చెయ్యాలి. అనగా పాండవులందరు ఒప్పకుంటారు. అర్జునుడొకనాడు ఒక బ్రాహ్మణుని గోవును చోరులబారినుండి రక్షించుటకు శరచాపములు (విల్లు బాణాలు) అవసరం పడతాయి. ఆ శరచాపములు ద్రౌపది సహిత ఐన ధర్మరాజు గృహంలో ఉంటాయి. అపుడు అర్జునుడు సదరు గృహంలో నుండి శరచాపములు తీసుకు వచ్చి సదరు బ్రాహ్మణుని గోవులను రక్షించి దోషపరిహారార్థం 12 నెలలు పుణ్యతీర్థాలను సేవించటానికి వెళ్తాడు.

41. పుణ్యతీర్థాలపర్యటనలో భాగంగా నాగలోకాధిపతియైన కౌరవ్యుని పుత్రిక ఐన ఉలూచిని అర్జునుడు గాంధర్వ వివాహంచేసుకొని ఐరావంతుడనే పుత్రుని పొందుతాడు పండ్రెండవ మాసందాటగానే క్షత్రియ దుస్తులు వేసుకొంటాడు, మణిపుర మహారాజైన చిత్ర వాహనుని కుమార్తె చిత్రాంగదను వివాహమాడి ఒక పుత్రునిపొందుతాడు. మామగారికోర్కెపై పుత్రుని దత్తత ఇచ్చి భార్యను కూడ అచటనే ఉంచుతాడు. ఒక ముని శాపంచే మొసలిరూపాలు ధరించిన దివిజకాంతలను (మొసళ్లను) చంపి తిరిగి దివజకాంతలుగా మారుస్తాడు.

42. కృష్ణుడు తన చెల్లెలు సుభద్రను, అర్జునునకు ఇచ్చి పెండ్లి చేయాలనుకొంటాడు మరియు బలరాముడు సుభద్రను దుర్యోధనునికివ్వాలని అనుకుంటాడు. కృష్ణుడు బలరాముని అంతర్ద్వీపానికి పంపి (కృష్ణుడు మాయా కృష్ణుడై తాను కూడ వెంట వెళతాడు) అసలు కృష్ణుడుగా తన చెల్లెలైన సుభద్ర అర్జునులవివాహం చేసి,వారిని ఇంద్రప్రస్థం పంపిస్తాడు. ఆ తర్వాత కృష్ణుడు బలరాముని మన బావ(అర్జునుడు)పైకి మనమే యుద్ధానికి వెళ్లడమా అని కోపవిముక్తున్ని

చేస్తాడు. ఇంద్రప్రస్థం వెళ్ళిన సుభద్ర అర్జునుణ్ణి పాండవులు ఆహ్వానిస్తారు. కొన్ని రోజులకు కృష్ణుడు, తల్లి దండ్రులతో, భార్యలతో తమ్ముడైన సాత్యకితో ఇంకా కొంతమంది పెద్దలతో ఇంద్రప్రస్థం వచ్చి కొన్ని రోజులుండి అందరూ వెళ్ళిపోతారు. కృష్ణుడు, సాత్యకి ఉండిపోతారు.

43. శ్వేతకి అనే రాజర్షి శతవార్షిక సత్రయాగం చేస్తు యేనుగు తొండమంత నేతి ధారను నూరు సంవత్సరములపాటు అగ్నిలో కుమ్మరిస్తే అగ్ని దేవునికి అజీర్ణ వ్యాధి రాగా, అట్టి విషయం బ్రహ్మతో చెప్పగా బ్రహ్మ ఖాండవ వనాన్ని దహించమని అందులోని దివ్య ఔషధాలవల్ల వ్యాధి నయం కాగలదని చెప్తాడు. అగ్ని దేవుడు వనంను దహించబోతే ఇంద్రుడు తన మిత్రుడైన తక్షకుడు ఆ వనంలో ఉన్నాడని వర్షం కురిపించి దహించనివ్వడంలేదు అని అగ్ని దేవుడు కృష్ణార్జునులతో చెప్పకుంటాడు. మరియు అగ్ని దేవుడు తనకు సహాయ పడమని అర్జునున్ని అర్థించి గాండీవమనే దివ్య ధనస్సును అక్షయ తూనీరాలను శాశ్వతంగా అర్జునునికిస్తాడు. అర్జునుడు ఇంద్రుని ఓడించి అగ్ని దేవునిచే ఖాండవ వనదహనాన్ని చేయిస్తాడు. తక్షకుడు తప్పించుకుంటాడు. వనం దహించుకుపోతుండగా ఏ జీవినికాని దేన్నికాని అందులోనుండి బయటకు పోనివ్వలేదు, కాని అర్జునుడు మయుడనే రాక్షస శిల్పాచార్యుడు శరణువేడగా విడిచి పెడతాడు. అందుకు కృతజ్ఞతగా మయుడు అత్యద్భుతమైన రాజసభ (మయసభ)ను నిర్మించి 8000 మంది రాక్షస వీరులచేత మోయించుకొని అర్జునునికి బహుమతిగా సమర్పించడమే కాకుండా భీమునికి ఒకగధను అర్జునునికి 'దేవదత్తం' అనే శంఖాన్ని ఇచ్చాడు.

44. సుభద్రార్జునులకు అభిమన్యుడు జన్మించాడు. ద్రౌపదికి ధర్మరాజువల్ల ప్రతివింధ్యుడు. భీముని వల్ల శ్రుతసోముడు, అర్జునుని వల్ల శ్రుత కీర్తి, నకులుని వల్ల శతానీకుడు, సహదేవుని వల్ల శుత్రసేనులనే పంచపాండవులు జన్మిస్తారు.

45. మయసభ నిర్మాణం అత్యద్భుతంగా ఉందని నారదుడు పాండవులను మెచ్చుకొని "రాజసూయం" మహా యజ్ఞం మీ తల్లి దండ్రులకు ఉత్తమమైన

స్థానం స్వర్గములో చేకూరేందుకు చేయమంటాడు. అందుకు పాండవులొప్పుకుంటారు. భీముడు జరాసంధుని వధించి అతని కుమారుడైన సహదేవునకు రాజ్యానికి పట్టాభిషేక్తుని చేసి చెరసాలలోని రాజులను విడిపిస్తారు.

46. భీమార్జున నకులసహదేవులు ఒక్కొక్కరు ఒక్కొక్క దిశగా వెళ్లి భూమినంతటిని జయించి తమ సార్వభౌమత్వాన్ని ప్రకటించి అపారమైన ధనరాశులతో ఇంద్ర ప్రస్థానికి తిరిగి వస్తారు. ధనరాసులుంచుటకు చోటులేక ప్రత్యేక ధనాగారాన్ని నిర్మింప చేశారు. పాండు పుత్రులఆహ్వానాన్ని పురస్కరించుకొని కౌరవులు, భీష్మాదులే కాక రాజులందరు, అత్రి మొదలగు దివ్య రాజదేవ, బ్రహ్మ మహర్షులు కూడా మహా యజ్ఞంలో పాల్గొనటానికి వచ్చారు. భీష్ముని అనుమతి ప్రకారం ధర్మరాజు కృష్ణుని యజ్ఞ భోక్తగా నిర్ణయించగా శిశుపాలుడు కృష్ణుడు తగని వాడని హేలన చేశాడు, అప్పడు కృష్ణుడు తన మేనత్తకిచ్చిన వాగ్దానం ప్రకారం శతాపరాధాలు పూర్తి కావడం వల్ల శిశుపాలదంత వక్రులను చక్రాయుధంతో సంహరిస్తాడు. ధర్మరాజు రాజసూయ మహ యజ్ఞం దీక్షగా పూర్తి చేసి, అతితులందరిని సత్కరించి పంపుతాడు. కౌరవ, భీష్మాదులు,కృష్ణ సాత్యకులుండిపోతారు.

47. మయ సభను చూచుటకు వెళ్లిన కౌరవులు (దుర్యోధనాదులు) అందులోని చాతుర్యంవల్ల దారిలేని చోట ఉన్నట్లు, ఉన్న చోట లేనట్లు, నీరు కూడా అలాగే చిత్ర విచిత్రంగా ఉండడంవల్ల అంతా మణులు, వజ్రాలు, పగడాలు, రత్నాలు, వెండి, బంగారంతో చేయబడినదగుటవల్ల దుర్యోధనుడు తడబడుతాడు, ఒక చోట దెబ్బతాకుతుంది ఒక చోట నీళ్లలో జారి పడతాడు. దానికి ద్రౌపది చెలులు విరగబడి నవ్వగా, ద్రౌపది వారిని వారిస్తు ముసిముసిగా నవ్వుతుంది. దుర్యోధనుడు అవమానంతో, ప్రతీకారవాంఛతో ఉర్రూతలూగిపోతాడు.

48. దుర్యోధనుడు శకునితో నాకు ద్రౌపది దాసియై పాండవులు కూడ దాసులు కావాలి అపుడు నా ప్రతీకారం తీరుతుందనగా, శకుని "నీ తండ్రి, భీష్మాదులను ఒప్పించాలి, ధర్మరాజుకు జూదమంటే ప్రాణసమానమైన

ఆట.మాయ పాచికలతో ఓడించి నీ కోరిక తీరుస్తాను" అని అంటాడు, అపుడు దుర్యోధనుడు దండ్రితో తనకు అవమానం జర్గిందని, ఏవేవో చెప్పి పాండవులను పిలిపించమంటాడు. విధురుడు పాండవులకు కీడు తలపెట్టవద్దని, ధృతరాష్ట్రునితో చెప్పినా వినకుండా అతన్నే పాండవులను, దుర్యోధనునిచే నిర్మించబడ్డ సరిక్రొత్త సభా భవన ప్రారంభోత్సవానికి పిల్చుకురమ్మని పంపుతాడు. విదురుడు ద్రౌపదిని పాండవులను హస్తినాపురానికి తీసుకువస్తాడు.

49. శకుని, కర్ణ, దుశ్శాసన పరివేష్టితుడైన దుర్యోదనుడు (దుష్ట చతుష్టయం) పాండవులకు సభాభవనం చూపిస్తూ పాచికలు, ఫలపుష్పాదులు గలఏకాంత మందిరానికి ఫలాలను సేవించుదామనే సాకుతో తీసుకువెళ్ళి రత్న కంబళంపై కూర్చుండ చేయగా. శకుని పాచికలాడుదాం అని అనగా భీమార్జున నకులసహదేవులు అది నీతి బాహ్యమైన ఆట అంటారు.శకుని, దుశ్శాసన దుర్యోధనులు చిత్ర విచిత్రమైన మాటలతో ధర్మరాజును పాచికలాడుటకు సిద్ధం చేస్తారు. విదురుడు భీష్మా, ద్రోణాదులముందు ఈ ఆట జరిగితే అన్యాయం జరగదని వారి ముందు జర్పిస్తాడు. ధర్మరాజు వజ్రవైఢూర్య, మరకత, మాణిక్య, నీలగోమేధకపుష్పరాగ పరిపూర్ణమైన ధనాగారాన్ని రాజభవనాల్ని, రాజ్యాన్ని, తమ్ములను తనను కూడా ఓడి తుదకు వెర్రి ఆవేశంలో భార్యను కూడా పందెంకట్టి ఓడిపోతాడు. భీముడు మధ్యలో ఆపుదామని లేస్తే అర్జునుడు శాంతించమని ధర్మదేవునివంటి అన్నకు అవమానం రానివ్వవద్దని వేడుకుంటాడు. దుర్యోధనునిచే ఆజ్ఞాపింపబడిన పాండవులు, రాజాభరణాలు దుస్తులు తీసి వేస్తారు.

50. భీష్ముని మందలింపుని కూడా నిర్లక్ష్యం చేసి దుర్యోధనునిచే ఆజ్ఞాపింపబడిన దుశ్శాసనుడు దుర్యోధనుని భార్య భానుమతి వద్దనుచుండగా కూడ ద్రౌపదిని పాండవులదాసివని చెబుతూ అంత: పురంనుండి ఏకవస్త్రయై ఉండగా వెంట్రుకలు పట్టి ఈడ్చుకొని వచ్చి దుర్యోధనుని ముందు పడవేశాడు. అపుడు భీముడు ధర్మరాజును తూలనాడుతు చంపుతానని పైకి పోగా అర్జున నకులసహదేవులు ఆపుతారు. (కర్ణుని కుమారుడు వికర్ణుడు) ద్రౌపది వస్త్రాపహరణం

చేయమని దుర్యోధునుడు చెప్పగానే భీష్మ, ద్రోణ, కృపాశ్వత్థామలు అచటి నుండి లేచివెళతారు. దుశ్శాసనుడపుడు చీరను పట్టిలాగుతాడు. ద్రౌపది భర్తలను ప్రార్థిస్తుందికాని వారు ధర్మానికి కట్టుబడి వంచిన తలలు ఎత్తరు. ఒక్కవూపుతో చీరకు శరీరానికి సంబంధ విడిపోతుందనగా ద్రౌపది కృష్ణుని ప్రార్థించగా కృష్ణుని చక్రా యుధం వచ్చి అక్షయవస్త్రాలనందిస్తుంది. దుశ్శాసనుడు లాగుతున్న చీర సభా భవనమంత నిండిపోతోంది. చక్రాయుధం నిప్పలను కౌరవులపై చిందించి, భయపెట్టగా వారు భయపడుతారు. దుర్యోధనుడు ద్రౌపదిని తొడపై కూర్చుండ మన్నందున భీముడు దుర్యోధనుని తొడలు విరగ్గొడతానని, దుశ్శాసనుని రొమ్ము చీల్చి నెత్తురు తాగుతానని, అర్జునుడు కర్ణుని శిరస్సు చేధిస్తానని, ద్రౌపది దుశ్శాసనుని చంపినప్పటి నెత్తురులో సంస్కారం చేసిన తర్వాతనే ఆ వెంట్రుకలను ముడివేస్తానని శపథం చేస్తారు. దృతరాష్ట్రుడు, భీష్మాదులు వెళ్ళిపోయారని భయపడి పాండవులను ద్రౌపదిని దగ్గరకు పిల్చి వారిని దాస్యవిముక్తులను చేస్తు రాజవేషాలు ధరించి, రాజధానికి వెళ్ళి పొమ్మని పంపగా వారు ఇంద్ర ప్రస్థం వెళ్ళి సుఖంగా గడుపుతారు.

51. దుర్యోధనుడు ప్రాణ త్యాగం చేస్తానని తండ్రిని భయపెట్టి పాండవులను ఉత్సవం పేరుతో పిలిపించమంటాడు. పాండవులు వస్తారు. ధర్మరాజు భీముడు వద్దన్న వినకుండా శకుని ప్రేరణతో జూదం ఆడి మాయపాచికలతో ఓడతాడు, రాజ్యాన్ని విడచి 12 ఏళ్ళు అరణ్యవాసం 1 సంవత్సరం అజ్ఞాతవాసం, అజ్ఞాతవాసంలో బయటపడితే మళ్ళీ అరణ్య, అజ్ఞాతవాసాలు. దుర్యోధనుని కుతంత్రం పారి పాండవులు అరణ్యవాసం వెళ్ళిపోతారు. సుభద్ర, అభిమన్య, ఉపపాండవులను ద్వారకకు చేర్పించుతారు. ధర్మరాజు అరణ్యవాసంలోని పాండవులవద్దనే ఉండిపోతామని వందలకొలది బ్రాహ్మణులొచ్చారు. ధర్మరాజు సూర్యుని కొరకు ఘోరతపస్సు ప్రారంభించిన కొంచెం సేపటికి సూర్యుడు ప్రత్యక్షమై అతని కోర్కెను తెల్సుకొని ఎందరనైన పంచభక్ష్య పరమాన్నలతో తృప్తి పర్చగలఅక్షయ పాత్రను ఇస్తాడు. ఆ అక్షయ పాత్రతో బ్రాహ్మణులను తృప్తి పరుస్తూ గడుపుతుంటారు.

52. కామ్యకవనంలో ఇంకా కొందరు బ్రాహ్మణులు వారితో కల్సి ఉండిపోతారు. కామ్యకవనంలోనే బకాసురుని తమ్ముడు, హిండబాసురుని స్నేహితుడై మహాభయంకరమైన కిమ్మీరాసురుని భీముడు ఘోరంగా హతమార్చుతాడు. బలరామ కృష్ణ ప్రభృతులు వచ్చి చూచిపోతారు. వ్యాసుడు కూడా వచ్చి "ప్రతి సృష్టి" మొదలైన యోగవిద్యలను ధర్మరాజుకుపదేశించి వెళ్లిపోతాడు. ధర్మరాజు చెప్పగా అర్జునుడు కఠోరమైన తపస్సు శివుని గూర్చి చేసి చతుర్ధశ భువనాలు ఒక్క తృటిలో ధ్వంసం చేయగలపాశుపతాస్త్రం సంపాదిస్తాడు. పాండవులు ద్వైత వనం నుండి, కామ్యకవనానికి, కామ్యకవనం నుండి ద్వైత వనానికి మారుతు గడపసాగారు.

53. ద్రౌపది సౌగంధికాసరోవరం సంరక్షకులనోడించి పుష్పాలను స్వీకరించి ఒడ్డుకు చేరుకునే సరికి, ధర్మరాజుచే ప్రార్థించబడి వచ్చిన ఘటోద్గజుడు ధర్మరాజు ఆజ్ఞచే పాండవులను ద్రౌపదిని ఎక్కించుకొని భీమని ఎదుట వాల్తాడు. అర్జునుడు స్వర్గంలోని దేవతలను బాధించే నివాత, కవచాదులతోను, పౌలోమ, కాలకేయులతోను యుద్ధం చేసి, ఓడించి తర్వాత ఇంద్రుడు దేవకార్యార్థం అర్జునున్ని ఇంకా కొన్ని రోజులు ఉంచుకొని దివ్యాస్త్ర విరాజితుడైన అర్జునున్ని పాండవులవద్ద విమానంలో దించిపోతాడు. కృష్ణుడు, సత్యభామసహితుడై వచ్చి పాండవులకు చెప్పవల్సిన మాటలు చెప్పి కొన్ని రోజులుండి వెళ్లిపోతాడు. కృష్ణుడున్నప్పడే మార్కండేయ మహర్షి వచ్చి పాండవులకు ధర్మ బోధలతో, వారలనుత్తేజితులను చేసి వెళ్లి పోతాడు.

54. దుర్యోధనాదులు గోసంరక్షకులు చెప్పినట్లు దుష్టమృగబాధను నివారించి వస్తామని ధృతరాష్టునితో చెప్పి పురంలో ఘోషయాత్ర ప్రకటిస్తాడు. చతురంగ బలాలతో, వర్తకులతో, వందమాగదులతో, వేలకొలది దాసదాసి జనులతో రాజనర్తకీమణులతో; భానుమతి మొదలైన నూర్వురు కౌరవ పత్నులు బంగారు పల్లకీలలో వస్తూండగా దుర్యోధనాది కౌరవులు, కర్ణ శకునులు దేవేంద్రవైభవంగా బంగారు రథాలలో పాండు పుత్రులను అవమానించే తలంపుతో ద్వైతవనం చేరుకొంటారు. అపుడే చిత్ర

సేనులవారు, రాణులతో ఒక సరోవరంలో క్రిడించడానికి వస్తున్నారని కౌరవులందరిని వెళ్ళి పొమ్మని గంధర్వ వీరులు ఆజ్ఞాపించగా దుర్యోధనాదులు యుద్ధానికి దిగి చిత్రసేనుని చేతిలో ఓడిపోతారు. దుర్యోధనున్ని బందించి తనలోకానికి తీసుకుపోతాడు. భానుమతి తమ భర్త దుర్యోధనుని విడిపించమని ధర్మరాజుకు కబురంపుతుంది. ధర్మాత్ముడై ఆ మహానుభావుడు భీమార్జునులను పంపుతాడు. వారు చిత్ర సేనుని ఓడించి అతడు స్నేహితుడు కాగా దుర్యోధనుని ధర్మరాజు కాళ్ళ ముందు పడ వేస్తాడు. దుర్యోధనుని కట్లు విప్పి బుద్దులు చెప్పి ధర్మరాజు అచటినుండి పంపుతాడు. దుర్యోధనుడు తన అనంతపరవారంతో వెళ్ళిపోతాడు.

55. దుర్యోధనుడు పాండవులకు తను ఆచరించే యజ్ఞానికి రమ్మని కబురంపగా 13 సంవత్సరాలతర్వాతనే వస్తాం అని పాండవులు చెబుతారు. పాండవులు కామ్యకవనంలోని తృణబిందు మునీంద్రుని ఆశ్రమంలో యుంటారు. ఒకనాడు ఒంటరిదైన ద్రౌపదిని ఆత్రోవలో పోతున్న కౌరవులచెల్లెలైన దుస్సలభర్త, సింధూ రాజ్యాధిపతి సైంధవుడు రథంపై బలవంతంగా ఎక్కించుకుపోతాడు. భీమార్జునులు సైంధవుని తన్ని చెల్లెలి భర్త కనుక ప్రాణలతో వదుల్తారు. ద్రౌపదిని ఓదార్చుతారు. సైంధవుడు శివుని గూర్చి తపస్సు చేసి ప్రత్యక్షమైన వెంటనే అర్జుని చంపేట్టు వరం ఇమ్మంటే అదినాకసాధ్యమని అర్జునుని తప్ప తక్కిన పాండవులను నీవు కోరుకున్న ఏదైనా ఒకరోజు ఎదిరించి నిలువరించగలుగుతావన్నాడు.

56. మార్కండేయ మునీంద్రుడు ధర్మరాజు వద్దకు వచ్చి ధర్మరాజు తనకు తనవాళ్ళకు జర్గుచున్న కష్టనష్టాలగూర్చి విచారంగా ఉన్నది చూచి ఇదంతా మంచిగే జరుగుచున్నదని చెబుతూ ధర్మరాజులాగా, రాముడు కూడ అనేక కష్టనష్టాలతో సతమతమయ్యాడని ఓదార్చుతూ రామాయణ మహాగాథను వివరిస్తాడు.

57. విశ్వవస బ్రహ్మ కుమారుడైన రావణాసురుడు బ్రహ్మ వల్ల వరాలు పొంది వర గర్వంతో, యజ్ఞయాగాదులను భగ్నం చేస్తూ సర్వలోకాలపై ఆధిపత్యాన్ని వహించి, అందమైన యువతులను చెరపట్టి తేసాగాడు, మరియు స్వర్గలోకం మీదకి దండెత్తి ఇంద్రాది దిక్పాలకులను తన శాసనం

క్రింద నడుచుకునేట్లు లోబర్చుకున్నాడు. ఆ రాక్షస బాధలకు తాళలేక దేవతలు శ్రీ మహావిష్ణువును శరణు కోరతారు. రావణుడు బ్రహ్మ నుండి వరాలు పొందేపుడు నరవానరులమీద తేలిక భావంతో ఆ రెండు జాతులవల్ల తప్ప మరెవరి వల్లను మరణం కల్గకుండ ఉండేట్లు కోరుకుంటాడు.

58. అయోధ్య నగరంలో దశరథుడు పుత్రకామేష్ఠి యజ్ఞం ద్వార నలుగురు కుమారులను పొందేట్లుగా వరం పొందాడు. శ్రీమన్నారాయణుడు, ఆదిశేషుడు, చక్రాయుధం, పాంచజన్యం రామలక్ష్మణ భరత శత్రుఘ్నులుగా పుడతారు. శ్రీమన్నారాయణుని భర్తగా పొందాలని తపస్సు చేస్తూ, రావణుని బలత్కారానికి లొంగక ఆత్మాహుతి చేసుకొన్న వేదవతి అయోనిజగా జన్మిస్తుంది (లక్ష్మీదేవి అంశవేదవతిలో ప్రవేశిస్తుంది) దేవతలు మునులు, వానరులుగా జన్మించి రావణాసురుని వధకు కారణం ఔతారు.

59. బ్రహ్మ తన పుత్రిక అహల్యను గౌతమునికిస్తాడు. ఇంద్రుడు కోడికూసినట్లు అర్థరాత్రి కూసి ముని స్నానానికి వెళ్ళగానే తను మాయ గౌతముని వేషంతో అహల్యతో క్రీడిస్తాడు. దివ్య దృష్టి ద్వార తెల్సుకొన్న ముని ఇంద్రుని శరీరమంత యోనులతోనిండి అసహ్యంగా బ్రతకమని, అహల్యను రాయివై పడి ఉండమని శపిస్తాడు. తర్వాత శాంతించి ఇంద్రుడు ప్రార్థించగా ఇంద్రుని యోనులు పరులకు కన్నులుగా కన్పడేట్లు, అహల్య రాముని పాదధూళితో తిరిగి అతని భార్యగా రాగలదని శాపాన్ని మార్చుకుంటాడు.

60. జనకుడు సీతారాములకల్యాణంతో పాటు తన తమ్ముని పుత్రికలైన ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తులను లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకిచ్చి వివాహం చేస్తాడు. దశరథుడు ఇంద్రుని ఆహ్వానాన్ని పురస్కరించుకొని కైకతో సహా వెళ్ళి కైక సహాయంతో రాక్షసులందరిని చీల్చి చెండాడి, రెండు వరాలు కోరుకొమ్మనగా వాటిని కైక రాముని పట్టాభిషేకం నాడుపయోగించుకుంటుంది. గుహుని కల్సి, శబరి ఆతిథ్యం స్వీకరించి ముని జనులను బాధిస్తున్న విరాదుడు, ఖరుడు, దూషణుడు మొదలగు రాక్షసులను సంహరించి రాముడు సీతా లక్ష్మణులతో క్రమంగా చిత్ర కూటం, భారద్వాజం దాటి దండకారణ్యం చేరుకున్నారు. సీతను రావణుడు

అపహరించిన తర్వాత సుగ్రీవుని కలిసేక్రమంలో దొతంగ పర్వతం చేరి వానరసేనును తయారుచేసి, హన్మంతుని ద్వార సీతజాడ తెల్సుకొంటాడు.

61. ఒక ముని నీలునికి నీలుడు ఏదినీటిలో పడవేస్తే అదితేలుతుందని వరం ఇస్తాడు. వానర వీరులు తెచ్చే పర్వతాలు, చెట్లను, నీలుడు తన చేతిలోకి తీసుకొని సముద్రంపై పడవేస్తు రామునికి వారధి కట్టుటకు సహాయం చేస్తాడు.

62. రాముడు వానర సేనతో లంకకు చేరి రావణుని వధించి సీతతో ఆయోధ్యకు వచ్చి రాముడు రాజ్యం చేస్తారు. అని రామాయణం చెప్పడం ముగిస్తాడు.

63. సతీ సావిత్రి కథ కూడ మార్కండేయుడు ధర్మరాజుతో చెబుతూ మద్రరాజైన అశ్వపతి నరేంద్రుని పుత్రిక సావిత్రి సాళ్వరాజైన ద్యుమత్సేన మహారాజు పుత్రుడైన సత్యవంతుని వివాహమాడుతుంది. నారదుడు చెప్పినట్టు సావిత్రి పరమేశ్వరీమహాదేవిని సత్యవంతుడు మూడురోజులకు చనిపోతాడనగా దివ్యమంత్రం జపిస్తూ పూజింపసాగింది. దేవి అపుడు కామరూపం కామగమనం కల్గిన వ్యక్తులను వెంటాడే శక్తిని ప్రసాదించగా తన భర్తప్రాణాలను కొనిపోతున్న యముని వెంట సావిత్రి పడగా యముడు సావిత్రి కోరిన మూడు వరాలను అనుగ్రహిస్తాడు. (1) సాళ్వరాజు దంపతులకు కళ్ళు రావాలని (2) వారి రాజ్య భ్రష్టత్వం పోయి రాజ్యం రావాలని మరియు (3) తన తండ్రికి నూర్గురు పుత్రులు కల్గాలని. వరాలిచ్చిన తర్వాత కూడ సావిత్రి తన పాతివ్రత్య మహిమతో అకాలప్రళయాన్ని సృష్టిస్తానని అనకముందే యమధర్మ రాజు సావిత్రి పతి ప్రాణాలను ఇస్తాడు. తద్వారా సత్యవంతునితో సావిత్రి సాళ్వరాజ దంపతులవద్దకు వెలుతుంది, అపుడు సాల్వరాజును రాజ్యం మళ్ళీ సిద్ధించిందని వారి మంత్రులొచ్చి తీసుకు వెడతారు. సత్యవంతునికి పట్టాభిషేకం చేస్తారు. అని కథను ముగించాడు. కొంత కాలానికి మార్కండేయుడు వెళ్ళి పోతాడు.

64. ఇంద్రుడు కర్ణుని కవచకుండలాలు కోరడానికిరాగా అట్టి పన్నాగాన్ని ఎరిగిన సూర్యుడు కర్ణుని కవచకుండలాలకోసం వచ్చిన ఇంద్రునికి అవి

ఇవ్వ వద్దని వాటివల్ల కర్ణునికి చావు లేదని చెబుతాడు. ఐనా వినకుండ ఇంద్రుడు అడిగిన వెంటనే సంతోషంగా సహజకవచకుండలాలనిచ్చి దాన కర్ణుడనిపించుకుంటాడు. అందుకు ఇంద్రుడు ఒక దివ్య బాణం (ఎవరని కోరుకుంటే వారిని సంహరించి మళ్ళీ ఇంద్రుని వద్దకి చేరేది)ను కర్ణునికిస్తాడు.

65. ధర్మదేవుడు పాండవులను ఒంటరిగా కల్సుకునే ఉద్దేశ్యంతో హరిణ రూపంలో వచ్చి ఒక ముని యొక్క "అరణి" (నిప్పకొయ్య అగ్నిహోత్రాదులు నిర్వర్తించేది)ని కొమ్ములకు తగిలించుకొని రాగా ఆ ముని పాండవులతో ఆ నిప్పకొయ్య (అరణి) లేకపోతే తాను అగ్ని హోత్రాదికాలు నిర్వర్తించుకోలేనని హరిణి బారి నుండి నిప్పకొయ్య ఇప్పించమని ప్రార్థించగా ఆ హరిణి పాండవులను చాలా దూరం పరిగెత్తించి తరుమ బడి మాయమౌతుంది అలసిపోయిన పాండవులు నీటికోసమై ఒకరి తర్వాత ఒకరు వెళ్ళిన భీమార్జున నకులసహదేవులను ధర్మదేవుడు మరణింప చేస్తాడు. ధర్మరాజు వచ్చిన వెంటనే మాయారూపుడైన ధర్మదేవుడు ధర్మాన్ని గూర్చి అనేక ప్రశ్నలు వేస్తాడు. వాటికి సరైన సమాధానాలు ధర్మరాజు ఇవ్వగా ధర్మదేవుడు సంతోషంతో నిజరూపంధరించి పుత్రుని చూసి. సంతోషించి చనిపోయిన నలుగురు పాండవులను బ్రతికించి అజ్ఞాతవాసంలో వారిని ఎవ్వరూగుర్తు పట్టకుండా వరం ఇచ్చి వారికి ఎప్పడు ఏరూపంకావలిస్తే ఆ రూపం వచ్చేట్టు వరాలను ఇచ్చి అంతర్థానుడౌతాడు.

66. పాండవులు తమకు దగ్గర బంధువు. ధర్మపాలకుడైన మత్స్య నగరరాజైన విరాట రాజు కొలువులో అజ్ఞాత వాసం (సేవకావృత్తితో) చేయ దల్చు కుంటారు. ధేమ్యుడు ఆనగరానికి దగ్గరలోని అరణ్యంలో ఒక సంవత్సరం కొరకు ఆశ్రమం నిర్మించుకొని వుంటాడు. పాండవులు తమ ఆయుధాలను శమీక (జమ్మి) వృక్షానికి కట్టి ధర్మార్జునులకు తప్ప తక్కిన వారందరికి శవరూపంలో కన్పడి భయం కల్గించేట్లు ఉండమని ఆయుధాలతో చెప్తారు. ధర్మరాజు కంకుభట్టు అనే పేరుతో రాజ్యంలో యే అరిష్టాలు లేకుండా కాపాడుతూ వినోధం, విజ్ఞానం కల్గించేట్లు, భీముడు వలలుడు అనే పేరుతో పాకశాలఅధ్యక్షుడుగా, అర్జునుడు పేడి మూతితో బృహన్నలలాగా ఉత్తర

కుమారికి అంత:పుర నాట్యాచార్యుడుగా, నకులుడు దామగ్రంథీగా అశ్వశాలాధ్యక్షుడుగా, సహదేవుడు తంత్రిపాలుడుగా గోగణాలను పాలించే గోపాలకులందరికి అధిపతిగా, ద్రౌపది సైరంధ్రిగా సుధేష్ణా దేవి (విరాటుని భార్య)కి వస్త్ర మాల్యానులేపనాదులను సమకూర్చుటకు ఒకరి తరువాత ఒకరు వచ్చి తాము ఇంతకు మునుపు ధర్మరాజు వారివద్ద ఉండేవారమని చెప్పి విరాటుని వద్ద నియమితులైనారు. విరాటుడు వారి తేజస్సు చూసి వారికి ఎంతో పెద్ద పదవులు, రాజ్యాలు యివ్వ చూపినా వినకుండా ఆయా పదవులలో నియమితులైనారు.

67. సుధేష్ణా దేవి తమ్ముడైన సింహబలుడు (కీచకుడు) సైరంధ్రిని అనుభవించుటకు తన భవనానికి పంపమంటే విధిలేక సుధేష్ణాదేవి పంపుతుంది. సైరంధ్రి సూర్యుని ప్రార్థించి అదృశ్య రాక్షసుని పొంది వాన్ని తోడు చేసుకొని వెడుతుంది. భవనం వద్దకు వెళ్ళి వాడు చెయ్యి పట్టుకొన వస్తుండగా అదృశ్య రాక్షసునిచే తన్నబడినవాడై దూరం పడిపోతాడు. సైరంధ్రి పరుగెత్తుకొని వచ్చి విరాటుని కొలువులో ప్రవేశిస్తుండగా కీచకుడు పరుగెత్తుకొచ్చి సైరంధ్రి శిరోజాలను ఒడిసి పట్టుకొని గట్టిగా లాగి క్రింద పడదోశాడు. అదృశ్య రాక్షసుని చేత తన్నబడినవాడై కీచకుడు సైరంధ్రిని ముట్టకుండా వారించబడినవాడై వెడలిపోతాడు.

68. సైరంధ్రి వలలుని (భీముడు)తో చెప్పగా వలలుడు ప్రేమించి నట్టు నటించి నర్తన శాలకు కీచకున్ని రమ్మనమంటాడు. ఆ మాటలు నమ్మి కీచకుడు వస్తే సైరంధ్రి బదులు భీముడు ఉండీ కీచకునిసైరంధ్రి చూస్తుండగానే కాళ్ళు, చేతులు విరచి భయంకరంగా చంపుతాడు. ఇట్టి పనులు భీముడు మారువేషాలతో ఎవరికి తెలియకుండా చేస్తాడు.

69. దుర్యోధనునికి భీముడు అజ్ఞాతంగా చేసిన పనులను బట్టి పాండవులు విరాటుని వద్ద ఉన్నారేమోనని అనుమానం వచ్చి, తమకు శత్రువైన విరాటుని గోవులను తరలించుకొస్తే, పాండవులు విరాటుని తరపున యుద్ధానికొస్తే గుర్తించి మళ్ళీ అడవులకు పంప వచ్చుననే కుయుక్తి పన్నుతాడు పాతపగతో రగిలిపోతున్న త్రిగర్త దేశధీశ్వరుడైన సుశర్మదక్షిణ

దిశగా సైన్యసమేతంగా వెళ్ళి ఆవులను తరలించగా, విరాటుడు తమ్ములతో, కంకుభట్టు, వలలుడు, దామగ్రంథ, తంత్రీపాలు. (వీరవేషాలుధరించి)రు సర్వసైన్యంతో వెళ్ళి సుశర్మనెదిరించి పోరాడి ఓడించారు వలలుడు సుశర్మను బందించి విరాటుని ముందు పడవేస్తాడు. తర్వాత సుశర్మను విడిచిపెట్టి ఆవులను తరలించుకువస్తారు.

70. విరాటాదులు దక్షిణంవైపు వెళ్ళిన వెంటనే ఉత్తరం వైపు ఆవులను దుర్యోధనాదులు తరలించుకుపోతున్నారనే వార్త వచ్చేసరికి విరాటుని పుత్రుడు ఉత్తరకుమారుడు రథసారథి కూడ లేకపాయెగదా అని అంత:పురంలో వీరాలాపాలతో శత్రువులను చీల్చి చెండాడుతున్నాడు, సైరంధ్రి బృహన్నలను సారథిగా తీసుకుపోమ్మంటే మొదట ఒప్పకోక తర్వాత బృహన్నలసారథికాగా రథంలో కౌరవసైన్యంవైపు వెళ్ళి సముద్రంకంటే విశాలమైన ఆసైన్యాన్ని చూసి ఉత్తర కుమారుడు బేలహృదయుడై ఇంటికి పోవుటకు రథాన్ని మళ్లించమంటే బృహన్నల(అర్జునుడు) ధైర్యం చెబుతాడు. ఐనా వినక రథం దిగి గృహోన్ముఖుడై పరుగు లంఘించుకుంటాడు. అర్జునుడు శత్రువులకు వెన్ను చూపక వెనక్కు పరుగెత్తి ఉత్తరకుమారున్ని పట్టుకుంటే అతడు ప్రాణభిక్ష అర్థిస్తాడు, అపుడు బృహన్నలనేను యుద్ధం చేస్తానని తనకు సారథిగా ఉండమని, రథం జమ్మి చెట్టువద్దకు నడిపించుతాడు. జమ్మి చెట్టుపై శవాకారంలో ఉన్న పాండవులఆయుధాలను చూపించి, ఏవి ఎవ్వరు ధరిస్తారో వివరించి, గాండీవం అమ్ములపొదులు తీసుకొని తక్కినవి యధా ప్రకారం పెట్టి రమ్మనగా ఉత్తరుడలాగే చేస్తాడు. అజ్ఞాతవాస సమయం నిన్నిటితో పూర్తయిందని తలంచి (పాండవులు) తాము మారువేషాలలో ఉన్న సంగతి చెప్పి తన నిజ అర్జునరూపం ఇంద్రుని స్మరించితెచ్చుకోగానే ఉత్తరుడు సంతోషాతిశయంతో అతని దివ్యమూర్తిని చూచి పాదాభివందనం చేస్తాడు.

71. పేడి రూపంరావటానికి కారణం ఏమిటని ఉత్తరుడడగగా స్వర్గంలో రాక్షసులను వధించి అమరావతిలో ఇంద్రుని ప్రేరణపై కొంతకాలం

ఉన్నప్పడు ఊర్వశి తన పొందును కోరిరాగ తాను మాతృభావంతో నిరాకరిస్తే విఫలమనోరథురాలై నంపుసకత్వం సిద్ధించేట్లు శాపం ఇస్తే ఇంద్రుడు తన ఇంద్రియ నిగ్రహాన్ని మెచ్చుకొని ఆశాపాన్ని ఒక్కసంవత్సరం మాత్రమే ఉండేట్లు అదియును అజ్ఞాతవాసంలో వరంగా ఉపయోగపడేట్లు మార్చాడని అర్జునుడు చెబుతాడు ఉత్తరుడు కోరగా అర్జునుడు తనకున్న పేర్లలో కొన్నింటిని చెబుతాడు. విజయుడు, ధనంజయుడు , శ్వేతవాహనుడు, కిరీటి, భీభత్సుడు, సవ్యసాచి, అర్జునుడు. ఫాల్గుణుడు, జిష్ణుడు, పార్థుడు.

72. అర్జునుడు కోరినట్టు ఉత్తరకుమారుడు రథం నడుపుతుండగా భీష్మ, ద్రోణ, కృపాచార్య, దుర్యోధన, కర్ణ అశ్వత్థామాదులను ఉత్తరునికి చూపిస్తు మొదటి ముగ్గురు మనపై ప్రేమకలవారు. వారు కౌరవులఉప్ప తింటున్నారు కనుక వారితో వచ్చారు. కాని వారు మనవారే అని చెబుతూ అడ్డు వచ్చిన శతృసైనికులను హతమార్చుతూ తమ గోగణాలను సమీపించి కౌరవసైన్యాన్ని చిన్నా భిన్నం చేసి, అంతవరకు విధి లేక కౌరవ బలాలకు లోబడి తమ గోవులను తామే శత్రువులవెంటతోలు కొనిపోతున్న తమ గోపాలకులను చూసి ఉత్తరుడు గోవులను వెనక్కి త్రిప్పకొని పొమ్మని, వారికి రక్షగా కొంత దూరం రథంతో సహా వెళ్ళి గోవులకు ఏ అపాయంరాకుండా చూచి వెన్నంటటానికి సమాయత్తం అవుతున్న కౌరవసేనలవైపు రథం మళ్ళించి, కర్ణుని ఎదిరిస్తాడు. అర్జునుడు వినోదంగా కొంచెంసేపు పోరాడి మహానీయ అస్త్రంతో వక్షోజాన్ని చేధించి కర్ణున్ని మూర్ఛిల్ల చేస్తాడు. అలాగే ద్రోణ, అశ్వాత్థమ భీష్మ, కృపాచార్యులరథాలను నుగ్గు నుగ్గు చేసి ఓడిస్తాడు. కర్ణుడు స్పృహ వచ్చి యుద్ధానికి తలపడగా శరీరమంత తూట్లు పడగొట్టి పరుగెత్తింప చేస్తాడు. దుర్యోధనుని శరీరాన్ని జల్లెడ గుంతలు చేయగా ప్రాణాలు కాపాడుకోడానికి పరుగెత్తుతాడు మళ్ళీ అందరూ యుద్ధసన్నద్ధమౌతుండగా సమ్మోహనాస్త్రంతో మూర్చిల్ల చేసి, దేవదత్తాన్ని పూరించి ప్రాణాంతకములైన బాణాలను నిర్విరామంగా వర్షిస్తు, సైనికులను చెల్లాచెదురు చేసి, మెరపు మెరసినట్టు అక్కడి నుండి అదృశ్యమయ్యాడు ఈ దృశ్యాన్నంత పైనుండి

పాండు రాజుతో సహా దేవతలు వీక్షిస్తారు.

73. గాండీవ, అక్షయ తూనీరాలు యధాస్థానంలో ఉంచి మళ్లీ బృహన్నలవేషం ధరించి ఉత్తరునితో బృహన్నలసృష్టించిన వీరుని సహాయంతో గెల్చామని విరాటునితో చెప్పమని తమయొక్క అసలు పేర్లను బయటపెట్ట వద్దని చెబుతాడు. ఉత్తరుడు కౌరవులను ఎదిరించి గోవులు మళ్లించాడనే వార్తవిని విరాటుడు పొంగిపోతాడు.

74. ఒకనాడు పాండవులు తమనిజస్వరూపాలను విరాటునికి వివరించి. ఇంద్రుని ప్రార్థించి తమ పూర్వ స్వరూపాలను పాండవులు పొందుతారు, విరాటుడు సంతోషించి తన తప్పలను క్షమించమంటాడు. తన పుత్రిక ఉత్తర కుమారిని, అభిమన్యునికిచ్చి అనేక మహారాజులముందు మహావైభవంగా వివాహం జరిపిస్తాడు.

75. ఆ వివాహానికి శ్రీకృష్ణుడు దేవేంద్రులతో సుభద్ర అభిమన్యులతో, ఉప పాండవులతో అసంఖ్యాక యాదవ వాహినితో వస్తాడు. శ్రీకృష్ణ సాత్యకులసూచన ప్రకారం ధర్మరాజు రాజ్యభాగం ఇస్తారో, యుద్ధానికి రమ్మన్నారో అడగమని కౌరవులవద్దకు పురోహితుణ్ణి దూతగాపంపగా దుర్యోధనుడు అట్టి హితోక్తులు పెడచెవినపెడతాడు అనంతరం దృతరాష్టుడు సంజయునితో రాజ్యం కోసం పెద్ద తండ్రి పుత్రులను చంపడంతగదని ధర్మరాజుకు కుటిలనీతులుచెప్పిపంపగా శ్రీకృష్ణుడు ఆసందేశాన్ని ఖండించిపంపుతాడు. సంజయరాయభారం స్వార్థబుద్ధితో కూడిన దని చివరిసారిగా కృష్ణుని రాయబారిగా పంపిస్తారు. దేవదేవుడైన కృష్ణుని మాటలు పాటించి ప్రాణాలు కాపాడుకొమ్మని పెద్దలు ఎన్ని విధాలుగా బోధించినా దుర్యోధనుడు వినక, శకుని, దుశ్శాసన, కర్ణులతో ప్రత్యేక మంతనాలు చేసి దుర్యోధనుడు కృష్ణున్నే బంధించ ప్రయత్నించాడు. లీలామానుష విగ్రహుడై భగవానుని విశ్వరూప ప్రదర్శనతో అల్పులను దిగ్భ్రాంతులనుచేసి, యుద్ధంతప్పదని పాండవులకు విజయం తథ్యమని అందరికి చెప్పాడు. కృష్ణుడు కర్ణుని కల్సుకొని పాండవులపక్షం రమ్మనగా కర్ణుడు పూజించి, దుర్యోధనునికి ద్రోహంచెయ్యనని వినయంగా తిరస్కరిస్తాడు.

76. కుంతీ కర్ణుని కల్సుకొని హితవాక్కులు తెల్పగా కర్ణుడు పూజించి అర్జునుని తప్ప తక్కిన ఎవ్వరిని ఏమీ చెయ్యనని, అర్జునునితో లేదా నాతో పంచపాండవులేనని చెప్పగా కుంతి తృప్తిపడుతుంది. ధర్మరాజు ఉపప్లావ్యం అనే విశాలప్రదేశంలో నివాసమేర్పర్చుకొని మిత్రులు, బంధువులైన రాజులను ఆహ్వానించగా సాత్యకి, దృష్టకేతు (చేదిరాజు), సహదేవుడు (జరాసంధపుత్రుడు), కేకయరాజులు, విరాటమహారాజు, ద్రుపదమహారాజు, పాండ్యభూపతిగారలు ఒక్కొక్కరు ఒక్కొక అక్షౌహిణిసైన్యంతో 7 అక్షౌహిణులుగా వచ్చి చేరారు. ఘటోద్కచుడు రాక్షసవీరులతో, ఐరావంతుడు (అర్జున ఉలూచి పుత్రుడు) అసంఖ్యాక నాగవీరసైన్యంతో రావడమేకాకుండా బంధుమిత్రులు సహాయార్థం విచ్చేశారు.

77. అర్జున దుర్యోదనులు కృష్ణుని వద్దకు వచ్చి కృష్ణుని సహాయం యుద్దంలో కావాలని కోరగా కృష్ణుడు వారినే కోరుకొమ్మనగా అర్జునుడు యుద్ధంచేయని కృష్ణున్ని, దుర్యోధనుడు పదివేలమంది యుద్ధంచేయు గోపాలవీరులను కోరుకుంటాడు. శల్యుడు, బాహ్లికుడు బలరాముడు ఇద్దరు కావల్సి నవారేకావున ఏవైపునకు రానంటాడు భూరశ్రవసుడు, సోమదత్తుడు, కర్ణుడు, గాంధారరాజు, కృతవర్మ, కాంభోజరాజు, సింధూనాయకుడు మొదలగువారు ఒక్కొక్కరొక్కొక అక్షౌహిణతోరాగా దుర్యోధనునికి తన రెండు అక్షౌహిణులతో కల్పి పదకొండు అక్షౌహిణులసైన్యం తయారు అయింది. దుర్యోధనుని సర్వసైన్యాధ్యక్షుడైన భీష్ముడు, కర్ణున్ని అర్జునునికి వెన్నిచ్చి పరుగిడిన వాడనగా కర్ణుడు కోపించి రణరంగంలో భీష్ముడు నేలకూలేంతవరకు యుద్ధం చేయనని ప్రతిజ్ఞ చేస్తాడు.

78. **మహాభారత కురుక్షేత్ర సంగ్రామ బలాబలాలు (అక్షౌహిణి)**

| | రథములు | ఏనుగులు | అశ్వాలు | కాల్బలము |
|---|---|---|---|---|
| పత్తి | 1 | 1 | 3 | 5 |
| సేనాముఖం | - | - | - | - |
| = 3 పత్తులు | 3 | 3 | 3 | 3 |

| | | | | |
|---|---|---|---|---|
| గుల్మం | | | | |
| (3సేనాముఖం 9 పత్తులు) | 3 | 3 | 3 | 3 |
| గణం= (3 గుల్మంలు) | 3 | 3 | 3 | 3 |
| వాహని (3 గణంలు) | 3 | 3 | 3 | 3 |
| పృథనం (3 వాహినులు) | 3 | 3 | 3 | 3 |
| చమువు=(3 పృథనములు) | 3 | 3 | 3 | 3 |
| అనాకిని=(3 చమువులు) | 3 | 3 | 3 | 3 |
| అక్షౌహిణ(10 అనాకినులు) | 10 | 10 | 10 | 10 |
| | 21,870 | 21,870 | 65,610 | 1,09,350 |

అక్షౌహిణి సైన్యం = 21,870 + 21,870 + 65,610 + 1,09,350 = 21,08,700

పాండవ సైన్యం 11 అక్షౌహిణులు = 21,8,700 11 = 24,05,700

21870 11= 2,40,570 రథములు+ 21870 11 = 02,40,570

ఏనుగులు + 65610 11=721710, అశ్వాలు+1,09,350 11 = 12,02,850

కాల్బలం 2,40,570 + 2,40,570+ 7,21,710 + 1,20,285 = 24,05,700

79. ధర్మరాజు దృష్టద్యుమ్ముని (ద్రుపదపుత్రుడు) సర్వసేనాధిపతిగా చేస్తాడు. యుద్ధంలో మొదటి సారి అర్జునుడు అందరూ బంధుమిత్రులే యుద్ధం చేయనని రథంనుండి క్రిందికి ఉరకగా కృష్ణుడు రథం ఆపి తన విశ్వ రూపాన్ని చూపించి, అందులో విశ్వమహాపురుషుడు పాండవులపక్షం వహించి కౌరవ సైన్యాలను తరుముతున్న దృశ్యం చూపించి, నీవు కేవలం నిమిత్త మాత్రుడవే ఈ మహాకార్యాన్ని నిర్వహింపచేస్తున్నది తనేనని చెప్పగా అర్జునుడు కృష్ణుని సహకారంతో కురుక్షేత్రం రక్త సిక్తం చేస్తానని అంటాడు. దృతరాష్టుని వద్దకు వ్యాసుడు వచ్చి అతనివల్లనే కురుకులానికి చేటు మూడిందని చెప్పి యుద్ధ వార్తలను సంజయుడు నివేదించేట్లు సంజయునికి దివ్య దృష్టి ఇచ్చి అంతర్ధానమౌతాడు. ఉపపాండవులు, అభిమన్యులు కూడ యుద్ధం చేయటానికి వచ్చారు.

80. యుద్ధం ప్రారంభమౌతుందనగా దృతరాష్ట్ర పుత్రుడైన 'వైశ్య' నందనుడు

యుయుత్సుడు సైన్యంతో పాండవులపక్షం వచ్చి చేరతాడు. పాండవ పక్షవీరులందరు సమఉజ్జిలైన కౌరవ వీరులతో తలపడి భయంకర యుద్ధం కొనసాగించనారంభించారు. ఒక్కొక్క బాణానికి వేనవేలుగా సైన్యాలు కూలుస్తున్న అర్జునుడు, భీష్మ, అభిమన్యులు ఒకరికి ఒకరు దివ్యాస్త్రాలను ప్రయోగించుకొంటూ భీకరయుద్ధం చేయసాగారు. శల్యుడు, ఉత్తరుని చంపగా భీముడు శల్యుని ఓడిస్తాడు, దుర్యోధనుని భీముడు ఓడిస్తాడు భీష్ముడు పాండవ సైన్యాన్ని చంపగా అర్జునుడు ఎదుర్కొంటాడు. సూర్యాస్తసమయంతో యుద్ధం ఆగిపోతుంది.

81. తెల్లవారి యుద్ధం మొదలుకాగా దుర్యోధనుని భీముడు మూర్ఛిల్ల చేస్తాడు. భీష్మునిచే చంపబడిన బలానికి రెండింతలుగా కౌరవ సైన్యాన్ని అర్జునుడు చంపుతాడు.

82. మూడవ రోజు భీష్ముడు అనేక పాండవ సైన్యాలను హతమార్చగా అర్జునుడు ఎదుర్కొని ఇద్దరు రెండు అగ్ని గోళాల్లాపోరాడారు, చివరికి భీష్ముని విరథుని చేయగా ద్రోణుడు తన రథంపై ఎక్కించుకుపోతాడు.

83. ఆ విధంగా భీష్ముని యుద్ధం తొమ్మిది దినాలు సాగగా పాండవసైన్యం 1/3వ వంతు కౌరవ సైన్యం దాదాపు 1/2వ వంతు నశించింది. అర్జునుని పుత్రుడైన ఐరావంతుడు అపార కౌరవసైన్యాన్ని నాశనంచేసి అలంబుసుని మాయవల్ల తలతెగి వీర స్వర్గం చేరుతాడు.

84. తొమ్మిదవ నాటి రాత్రి పాండవులు, కృష్ణునితో రహస్యంగా భీష్ముని వద్దకు వెళ్ళి, భీష్మునెవరు జయించలేరని మీరలా యుద్ధం చేస్తే మేం ఓడిపోయే బదులు మీకిష్టమైతే రాజ్యం దుర్యోధనునికి విడచి పెడతామని అనగా భీష్ముడు ఇలా చెప్పాడు. విచిత్ర వీర్యుని వివాహానికి తీసుకొచ్చిన అంబ సాళ్వరాజును ప్రేమించానని చెప్పి తిరిగి అతని వద్దకువెళ్ళగా, అతడు నిరాకరిస్తే ఆమె మళ్ళీ తన వద్దకు వస్తే ఇతరులను ప్రేమించిన కన్యను విచిత్ర వీర్యునికిచ్చి వివాహం చేయడానికి తాను నిరాకరిస్తే, ఆమె ఘోరమైన తపస్సు చేసి ఈశ్వరుని కృప వలన, ద్రుపదుని కడుపున కూతురై పుట్టి, యక్షుని వరంవల్ల మగతనం పొందింది, ఆమెయే ఇపుడు శిఖండి

అలనాటి ఆ అంబే ఈ శిఖండి అని ఆడతనం నుండి మగతనానికి మారిన అతన్ని చూస్తే తాను యుద్ధం విసర్జిస్తానని అతన్ని ముదుంచుకొని తనను కూల్చమంటాడు.

85. భీష్ముడు పదవనాటి యుద్ధంలో పాండవ సైన్యంపై విజృభించగా భీష్మ అర్జునులు భీకర సంగ్రామం చేస్తారు. కొంతసేపటికి కృష్ణ ప్రేరితుడై అర్జునుడు శిఖండిని రథంలో ఎక్కించుకొన్నాడు. భీష్ముడు శిఖండిని చూసి ఆయుధం పట్టి యుద్ధం చేయననగా లక్ష్యశుద్ధితో, మంత్రపూర్వకంగా ప్రయోగింపబడిన అర్జునుని బాణం బీష్ముని వక్షం నుండి అవతలికి దూసుకుపోగా బీష్ముడు రథంపై నిల్వలేనని, వీరోచితశయ్య నేర్పాటుచేయమనగా అంపశయ్యను ఏర్పాటు చేసి, బాణం భూగర్భంలోకి విడచి బీష్ముని కోరికపై అతనికి పాతాళగంగధార నోటిలో పడగొడతాడు. తనతండ్రి వరంవల్ల స్వచ్ఛంధ మరణంకలదని ఉత్తరాయణపుణ్యకాలం వరకు ప్రాణాలు నిల్పుకుంటానని బీష్ముడు చెబుతాడు. పరిచర్యలకు దాసీలను, రక్షకభటులను ధర్మరాజు నియమించుతాడు. కర్ణుడు తన్ను క్షమించమని భీష్ముని ప్రార్థించగా భీష్ముడు ఆశీర్వదిస్తాడు. భీష్ముడు రణరంగం నుండి అస్తమించాడని విన్న దృతరాష్టుడు విలపిస్తాడు, ద్రోణునికి సర్వసైన్యాధిపత్యాన్ని అభిషేకించారు.

86. తెల్లవారి ద్రోణుడు చాలమందిని మూర్ఛిల్ల చేయగా అభిమన్యుడు ద్రోణుని విరథునిగా చేస్తాడు. తరువాత దుర్యోదనుని శరీరంనిండా బాణాలు వర్షించి విరథుని చేస్తాడు. భీముడు, శల్యుని ఓడించాడు. అభిమన్యుడు కర్ణుడు తలపడతారు చెరి కొందరు ప్రముఖులతో తలపడతారు. అనేక మందిని హతమార్చి ద్రోణుడు ధర్మరాజుతో తలపడగా అర్జునుడొచ్చి ద్రోణునితో భయంకరంగా యుద్ధం చేస్తాడు. అంతలోకే ప్రొద్దుగృంకుతుంది.

87. ఒక్క సారి తొండంప్రయోగించి వందలమందిని హతమార్చగలసు ప్రతనమనే దివ్య గజాన్ని వృకోదరుడేం చేయలేకపోగా అర్జునుడు హతమార్చుతాడు. కృష్ణుడు దుర్యోధనుని పదివేలసైన్నాన్ని చంపుతాడు. అర్జునుడు తన శరపరంపరలతో అనేకమంది వీరులను చంపి, కర్ణుని

(శరపరంపరలతో) మూర్ఛిల్ల చేయగనే యుద్ధం విరమిస్తారు.

88. సంశప్తుకుని సైన్యం అర్జునుని దూరంతీసుకొని వెళ్ళగానే పద్మవ్యూహం పన్నుతారు చొరబడటం మాత్రం తెల్సిన అభిమన్యుడు చొరబడతాడు. ఈశ్వరుడు తనకు ప్రసాదించిన వరం తల్చుకొని సైంధవుడు పాండవులు లోనికిపోకుండా అడ్డు నిల్చాడు. ఎందరెందరో ప్రసిద్ధమైన రాజులతోసహా దాదాపు అక్షౌహిణి బలాన్ని అభిమన్యుడు హతమార్చుతాడు. ఓడించటం చేతకాని కౌరవులు అధర్మంగా వెనుకనుండి వచ్చి విల్లు విరగొట్టి అభిమన్యుని ఘోరదుర్మరణం పాలుచేస్తారు. అర్జునుడు పాండవులనెదిరించి తన పుత్రుని మరణానికి కారకుడైన సైంధవుణ్ణి ప్రొద్దుగ్రుంకే వరకు హతమార్చుతానని లేదా అగ్ని ప్రవేశం చేస్తానని ప్రతిజ్ఞ చేస్తే సైంధవుడు భయపడిదాక్కుంటాడు. కృష్ణుడు చక్రాయుధం సూర్యునికడ్డు పెట్టగానే ప్రొద్దుగ్రుంకిందని అర్జునుని అగ్ని ప్రవేశ వేళ వచ్చిందని ఇవతలికి వచ్చిన సైంధవుణ్ణి అర్జునుడు హతమార్చగానే కృష్ణ చక్రం వైదొలగి సూర్యబింభం యదావిధిగా ప్రకాశిస్తుంది.

89. ద్రోణుని ఐదవరోజు యుద్ధంలో నరోకుంజరో అశ్వాత్థామ హతోహత: అనే చమత్కారపూర్వకమైన వాక్యం కృష్ణుని ప్రేరణవల్ల ధర్మరాజు అనడంవల్ల ద్రోణుడు పుత్రుడు మరణించాడని మూర్ఛిల్లగానే దృష్టద్యుమ్నుడు ద్రోణుని శిరస్సుఖండిస్తాడు. గురుమరణానికి విలపిస్తూ దుర్యోధనాదులు ప్రొద్దుగృంకడంతో ఆనాటికి పోరుచాలిస్తారు.

90. ద్రోణుని మరణం తర్వాత కర్ణుడు సైన్యాధ్యక్షుడుగా ఉంటాడు అతడు (కర్ణుడు) అక్షౌహిణికి పైగా కౌరవ సైన్యాన్ని హతమార్చిన ఘటోత్కచున్ని హతమార్చుతాడు. ఆ దినమంతా భీష్మద్రోణులతలపింపజేసే భీషణ సంగ్రామం గావిస్తాడు.

91. తన కుమారున్ని చంపినందుకు కర్ణుని చంపుతానని ప్రతిజ్ఞ చేసిన అర్జునుడు కర్ణుని రథచక్రం భూమిలో దిగబడిపోయే సమయంలో కృష్ణ ప్రేరితుడై కర్ణుని శిరస్సును భూమిమీద పడేలా బాణంవదుల్తాడు. పాండవసైన్యం సింహనాదంచేస్తుంటే కౌరవ సైన్యం వెలవెలపోయింది.

92. పాండుపుత్రులసైన్యాలను యెన్నింటినో ఈ రోజు సైన్యాధ్యక్షుడైన శల్యుడు

రూపుమాపగా ధర్మరాజు శక్తి మహాయుధం ప్రయోగించి శల్యుని వధిస్తాడు. శకునిని నకులసహా దేవులు చంపుతారు. దుశ్శాసనుని వక్షం చీల్చి భీముడు నెత్తురుత్రాగి ద్రౌపది. కేష బంధనం సవరించాడు.

93. ఆవిధంగా 18 దినాలు సాగిన కురుక్షేత్ర మహా సంగ్రామంలో యిరుపక్షాలసైనికులు రాజులందరు నాశనం ఐపోయారు. దుర్యోధనుడు నిస్సాహాయుడై, యుద్ధ భూమినుండి వెడలిపోయి జలస్తంభన విద్యానైపుణ్యం వల్ల సరస్సులో దాగుకోగా పాండవులు అచ్చటికి వెళ్ళి దుర్యోధనుని నీటిపైకి రమ్మంటారు. అపుడు దుర్యోధనుడు, మీ ఐదుగురిలో ఏ ఒక్కరితోనైనానే పోరి గెలిస్తే నారాజ్యం నాకు ఇచ్చివేయాలి అంటాడు అందుకు పాండవులొప్పకోగా భీముని కోరుకొని దుర్యోధనుడు యుద్ధం చేస్తాడు. కృష్ణునిచే విన్న అర్జునుడు దుర్యోధనుని తొడలు విరుగగొట్టమని సంజ్ఞ చేయగా భీముడు ఒక గధాయుధంతో తొడలు వ్రయ్యలు చేసి వెంట్రుకలు పట్టి లాగుతూ, శిరస్సును తంతాడు, దుర్యోధనుని పరిచర్యకు సేవకులను నియమిస్తాడు ధర్మరాజు.

94. కృపాచార్య, కృతవర్మలుండగా దుర్యోధనుడు అశ్వత్థామతో తన కడసారి కోరికగా ఉప పాండవులను హతమార్చుమంటాడు అందుకు అశ్వత్థామ పరమశివుని మహానిష్టాగరిష్ఠుడై ధ్యానం చేసి ఈ రాత్రిగడిచేవరకు ఏ మహోత్తర శక్తులు కూడ ఏమి చేయకుండా అనుగ్రహించమని కోరుకోగా శివుడు అనుగ్రహిస్తాడు. కృష్ణుడు దివ్యదృష్టితో ఇదంతా తెల్సికొని నిద్ర రావటంలేదని విజయవార్తలను చెప్పకుంటూ గంగాతీరంలో గడుపుదామని పాండవులను తీసుకువెడతాడు. కృప, కృతవర్మ అశ్వత్థామలు గుడారాలలో ప్రవేశించి, దృష్టద్యుమ్నుడ్ని, ఉపపాండవులను, చతురంగ బలాలను, సైనికులను హతమార్చి ఈ విషయం దుర్యోధనునితో చెప్పగానే అతడు ప్రాణం వదులుతాడు.

95. పుత్రులను చంపిన అశ్వత్థామను తీసుకురమ్మనగా అర్జునుడు యుద్ధం చేసి బంధించి తెచ్చి ధర్మరాజుకు అప్పగిస్తాడు, కాని ద్రుపదరాజ పుత్రి అశ్వత్థామను బంధవిముక్తున్ని చేస్తుంది. అశ్వత్థామ చివరకు పాండవులను ఆశీర్వదించి కృపాచార్యునితో పాటు తపస్సు చేసుకొనుటకు

వెళ్ళి పోతాడు.

96. రెండుపక్షాలవారు నిరవశేషంగా హతంకాగానే, ధర్మరాజు అందరికీ పరలోకవిధులను నిర్వర్తించి తమ్ములతో భీష్ముని వద్దకు వెలతారు. ఆ మహాత్ముడు ధర్మతత్వాలను బోధించి, ఆశీర్వదించి శరీరాన్ని త్యజిస్తాడు. ఆ పూజ్యునికి అగ్ని సంస్కారాదులు కావించి,తల్లి కోరికపై కర్ణునికి కూడా తర్పణప్రధానం చేశాడు.

97. ధర్మరాజుకు వ్యాసుని సమక్షంలో దృతరాష్టుడు పట్టంకట్టి, భార్య, కోడండ్రతో, విదురునితో, కుంతితో అరణ్యాలకు వెళ్ళి ఉగ్ర తపస్సు చేసి స్వర్గం చేరుకోగానే ధర్మరాజు అందరికి అపకర్మలుచేయించాడు.


98. కృష్ణునితో 500 సంవత్సరాలు ధర్మరాజు చల్లగా సుఖించి రాజులను చంపిన పాపం పోయేట్టు అశ్వమేధయాగం చేయించాడు. ద్వారకలో యాదవులందరితోసహా కృష్ణ బలదేవులు మృతిచెందారని అర్జునుడు చెప్పగానే ధర్మరాజు పాపభూయిష్టమైన కలియుగం నివాసయోగ్యం కానందువల్ల శ్రీ కృష్ణుడు మరణించాడని చెబుతాడు.

99. వెంటనే మంత్రులను హితులను పురోహితులను పిలిపించి ఉత్తరనందనుడైన పరీక్షిత్తుకు పట్టాభిషేకం చేసి రాజ్య భారమంతా అప్పగిస్తాడు.

100. ధర్మరాజు ద్రౌపదితో సహా పాండవులు ఉత్తరదిశాభిముఖులై వెళ్ళి ఎన్నోతీర్థాలు సేవించి తన తండ్రి పరమపదించిన శతశృంగ మహా పర్వతంచేరుకొని ఉగ్రమైన తపస్సు చేశారు. ధర్మరాజు ఇంద్ర రథాన్ని ఆరోహించి స్వర్గారోహణచేశాడు.

అని చెప్పి వైశంపాయనుడు రెండుచేతులు జోడించి పవిత్రమైన మహాభారత కథకు నమస్సులన్నాడని సూతమహర్షి శౌనకాదినైమి శారణ్యఋషులందరికీ చెప్పాడు.

# మహాభారత వంశ స్వరూపం



మతినారుడు-సరస్వతి

↓

నీలుడు-రథంతర

↓

దుశ్యంతుడు-శకుంతల

↓

భరతుడు (భరతవంశం)-సునంద

↓

భరతుడు - సునంద

↓

ఉభుమన్యుడు - విజయ

↓

సుహుద్రుడు - సువర్ణ

↓

హస్తి (ఇతని పేరున హస్తినకు ఆ పేరు వచ్చింది) - యశోధర

↓


వికుంఠనుడు - వసుదేవ


↓

అజమీడుడు - కైకేయ + గాంధారి + ఋక్ష (వీరికి 124 మంది పుత్రులు
వీరిలో రాజవారసుడు సంవరణుడు)


↓

సంవరణుడు - తపతి


కురు (ఇతని పేరునే కురుక్షేత్రం అన్న పేరు వచ్చింది) - శుభాంగి
విదూరుభువుడు - సింప్రియ
అశశ్వుడు - అమృత
పరీక్షితుడు - సుయశ
భిమసేన - కుమారి
ప్రతిశ్రసుడు - పేరు తెలియదు
ప్రతిశ్రసుడు - పేరు తెలియదు
ప్రతీపుడు - సునంద (వీరికి దేవాపి శంతనుడు, బాహ్లికుడు పుత్రులు, వీరిలో రాజ్యవారసుడు శంతనుడు)
గంగ - శంతనుడు
శంతనుడు - సత్యవతి
సత్యవతి - పరాశరుడు
భీష్ముడు
చిత్రాంగదుడు - విచిత్ర వీర్యుడు
వ్యాసుడు



అంబిక - వ్యాసుడు
అంబాలిక - వ్యాసుడు
వ్యాసుడు - దాశి
ధృతరాష్టుడు
పాండు రాజు
విదురుడు
ధృతరాష్టుడు - గాంధారి
పాండు రాజు - కుంతీ
పాండు రాజు - మాద్రి
ధుర్యోధన, దుశ్శాసన మొదలగు నూర్గురు పుత్రులు, దుశ్శలకూతురు
ధర్మరాజు బిముడు అర్జునుడు
నకులుడు సహదేవుడు
ద్రౌపది

ధర్మ రాజు - ద్రౌపది
భిముడు - ద్రౌపది
అర్జునుడు - ద్రౌపది
నకులుడు - ద్రౌపది
సహదేవుడు - ద్రౌపది
ప్రతివింద్యుడు
శృతసోముడు
శృతకీర్తి
శతానీకుడు
శృతసేనుడు

# పాండవులకు వారి వారి భార్యల వల్ల జన్మించిన సంతానం

భీముడు - హిడింబి → ఘటోత్కచుడు

ధర్మరాజు - దేవిక → యోధేయుడు

భీముడు - జలంధర → సర్యగుడు

నకులుడు - రేణుమతి → నిరమిత్రుడు

సహదేవుడు - విజయ → సుహోత్రుడు

అర్జున - సుభద్ర → అభిమన్యుడు & ఉత్తర → పరీక్షిత్తు - మాద్రవతి → జనమేజయుడు

అర్జునుడు - చిత్రాంగద → బభ్రువాహనుడు

అర్జునుడు - ఉలూపి → ఐరావంతుడు

# పురాణాలు

మానవులు పాటించవలసిన ధర్మములు, చేయవలసిన కార్యములు, దర్శించవలసిన క్షేత్రములగూర్చి తెలుపునవి పురాణములు. ఇవి కథలరూపంలో ఉండును

శ్రీ మహావిష్ణువు యొక్క అంశవల్ల జన్మించిన శ్రీవ్యాస భగవానుడు అష్టాదశ పురాణాలు, వేద విభాగం, బ్రహ్మసూత్ర రచన, మహాభారత రచన చేసిన గొప్ప మహర్షి ఈ పురాణాలను రచించినది వ్యాసమహర్షి అయితే వాటిని నైమిశారణ్య వాసులకు వినిపించినది సూతమహాముని (సూతుడు), వానిని జనారణ్యానికి తెలియజేసినది శౌనమహాముని మరియు 88 వేలఋషి పుంగవులు.

## అష్టాదశ పురాణాలు

| | | |
|---|---|---|
| 1. బ్రహ్మపురాణం | 2. పద్మపురాణం | 3. విష్ణుపురాణం |
| 4. వాయుపురాణం | 5. శ్రీమద్భాగవతపురాణం | 6. నారదపురాణం |
| 7. మార్కండేయపురాణం | 8. అగ్నిపురాణం | 9. భవిష్యపురాణం |
| 10. బ్రహ్మవైవర్తపురాణం | 11. లింగపురాణం | 12. వరాహపురాణం |
| 13. స్కాందపురాణం | 14. వామనపురాణం | 15. కూర్మపురాణం |
| 16. మత్స్యపురాణం | 17. గరుడపురాణం | 18. బ్రహ్మాండపురాణం |

### పురాణాల్లోని ప్రధానమైన సందేశాలు :

1. **బ్రహ్మపురాణం** : ధర్మాన్ని రక్షించడం ద్వారా రాజ్యం, స్వర్గం, ఆయువు, కీర్తిప్రతిష్ఠలు, మోక్షం మొదలైనవి సిద్ధిస్తాయని బ్రహ్మపురాణం చెబుతుంది.
2. **పద్మపురాణం** : సృష్టిలోని సమస్తమూ హరిమయమే అని ఉపదేశిస్తున్నది పద్మపురాణం.
3. **విష్ణుపురాణం** : శివ - కేశవులమధ్య భేదం లేదనీ ఈ కారణంగా వారిని భేద భావంతో చూడరాదని విష్ణుపురాణం సందేశం.

4. **వాయుపురాణం** : గయాక్షేత్రాన్ని దర్శించి వచ్చిన పుత్రుడు, తల్లిదండ్రులకు అమితానందాన్ని కలుగజేస్తాడని వాయుపురాణ కథనం.

5. **శ్రీమద్భాగవతపురాణం** : మోక్ష సాధనాల్లో అత్యుత్తమమైనది భక్తియే అంటూ భక్తితత్త్వాన్ని సూచిస్తోంది శ్రీమద్భాగవతం.

6. **నారదపురాణం** : ఏకాదశీవ్రతాన్ని నియమ - నిష్ఠలతో ఆచరించాలని తద్వారా అభీష్టాలన్నీ సిద్ధిస్తాయని రుక్మాంగదచరిత్ర ద్వారా ఉపదేశిస్తోంది నారదపురాణం.

7. **మార్కండేయపురాణం** : దుర్గాసప్తశతి పారాయణ ద్వారా సంపదల్లోనూ, ఆపదల్లోనూ శ్రేయస్సు కలుగుతుందని మార్కండేయ పురాణోక్తి.

8. **అగ్నిపురాణం** : ఉత్పత్తి - ప్రళయాలను, ప్రాణులజీవన - మరణాలను, విద్య అవిద్యలను తెలిసిన వాడే భగవంతుడని నిర్దేశిస్తున్నది అగ్నిపురాణం.

9. **భవిష్యపురాణం** : సూర్యభగవానుని మహిమలను తెలియజేస్తోంది భవిష్య - పురాణం.

10. **బ్రహ్మవైవర్తపురాణం** : అతిథులను గౌరవించగలగడమలవరచు కోవాలని హితోపదేశం చేస్తోంది బ్రహ్మవైవర్తపురాణం.

11. **లింగపురాణం** : కాశీక్షేత్ర మహాత్మ్యాన్ని బోధిస్తున్నది లింగపురాణం.

12. **వరాహపురాణం** : యమునా - సరస్వతులసంగమంలో విష్ణుపూజ సకలాభీష్ట ప్రదాయకమని వరాహపురాణం వక్కాణిస్తుంది.

13. **స్కాందపురాణం** : శ్రీ సత్యనారాయణాస్వామి వ్రతమహాత్మ్యాన్ని, దేవాలయ జీర్ణోద్ధరణ ఫలాన్ని తెలియజేస్తున్నది స్కంద పురాణం.

14. **వామనపురాణం** : విష్ణు భక్తులు, విష్ణు మందిరాలను గురించి విశదపరుస్తోంది వామన పురాణం.

15. **కూర్మపురాణం** : తమ బాధ్యతల్ని విస్మరించి పుణ్యక్షేత్రాలదర్శననెపంతో వెళ్లరాదని కూర్మపురాణ హితోక్తి.

16. **మత్స్యపురాణం** : మరణించిన పితృదేవతలకు భక్తి శ్రద్ధలతో శ్రాద్ధవిధిని జరపాలని హెచ్చరిస్తోంది మత్స్యపురాణం.

17. **గరుడపురాణం** : అగ్రవర్ణాలవారు తమ క్రింది కులాలవారిని నీచదృష్టితో చూడరాదని హెచ్చరిస్తోంది గరుడపురాణం.

18. **బ్రహ్మాండపురాణం** : భారతదేశపు భౌగోళిక వర్ణన. గ్రహ - నక్షత్రాలకు సంబంధించిన వివరణనిస్తోంది బ్రహ్మాండ పురాణం.

పురాణాల్లో ఇన్ని నిక్షేపాలున్నాయి గనుకనే మన దేశంలో నేటికి ఎన్నో దేవాలయాల్లో నిత్యపురాణ ప్రవచనాలు జరుగుతున్నాయి. ఈ విధంగా పురాణాల్లో ఆధ్యాత్మిక విషయాలు మాత్రమే గాక సామాన్యులకుపయోగపడే రీతులు, నీతులు ఎన్నో దర్శనమిస్తాయి.

# ఉపనిషత్తులు (108)

ఉపనిషత్తులకు మరొక పేరు వేదాంతములు. ఒకప్పుడు మహాఋషులు ఋషి పుత్రులును ఒక్క చోట జేరి ఆత్మయన నేమి? అనాత్మ యననేమి? జీవుడనెవ్వడు ? జీవేశ్వరులసంబంధమెట్టిది ? మనమెచ్చటి నుండి వచ్చితిమి ? ఎచ్చటకు పోయెదము? అను ప్రశ్నలను గురించి చర్చలు జరపగా ఫలించిన జవాబులే ఉపనిషత్తులు. ఈ ఉపనిషత్తులసంఖ్య నూట ఎనిమిది. ఇందులో పది ఉపనిషత్తులు మాత్రమే ఆది శంకరాచార్యులకాలమున సర్వాంగీకారము పొందినట్లు తెలియు చున్నది. అవి ఈశ, కేష, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, చాందోగ్య, బృహదారణ్యకము - అను దశోపనిషత్తులమీదనే ఆచార్యులవారు భాష్యములు రచించారని తెలియు చున్నది.

1. ఈశావాస్యోపనిషత్
2. కేనోపనిషత్
3. కఠోపనిషత్
4. ప్రశ్నోపనిషత్
5. ముండక్యోపనిషత్
6. మాండూక్యోపనిషత్
7. తై త్తిరీయోపనిషత్
8. ఐతరేయోపనిషత్
9. ఛాందోగ్యోపనిషత్
10. బృహదారణ్యకోపనిషత్
11. బ్రహ్మోపనిషత్
12. కైవల్యోపనిషత్
13. జాబాలోపనిషత్
14. శ్వేతాశ్వతరోపనిషత్
15. ఘంసోపనిషత్
16. ఆరుణికోపనిషత్
17. గర్భోపనిషత్
18. నారాయణోపనిషత్
19. పరమహంసోపనిషత్
20. అమృతబిందూపనిషత్
21. అమృతనాదోపనిషత్
22. అథర్వశిరోపనిషత్
23. అథర్వశిఖోపనిషత్
24. మైత్రాయణ్యుపనిషత్
25. కౌషితకీబ్రాహ్మణోపనిషత్
26. బృహజ్జాబాలోపనిషత్
27. నృసింహతాపిన్యుపనిషత్ (పూర్వతాపిని, ఉత్తరతాపిని)
28. కాలాగ్నిరుద్రోపనిషత్
29. మైత్రేయో పనిషత్
30. సుబాలోపనిషత్
31. క్షురికోపనిషత్
32. మంత్రికోపనిషత్
33. సర్వసారోపనిషత్
34. నిరాలంబో పనిషత్
35. శుకరహస్యోపనిషత్
36. వజ్రసూచ్యుపనిషత్
37. తేజోబిందూపనిషత్
38. నాదబిందూపనిషత్
39. ధ్యానిబిందూపనిషత్
40. బ్రహ్మవిద్యోపనిషత్
41. యోగతత్వోపనిషత్
42. ఆత్మబోధోపనిషత్

43. నారదపరివ్రాజకోపనిషత్
44. త్రిశిఖబ్రాహ్మణోపనిషత్
45. సీతోపనిషత్
46. యోగచూడామణ్యు పనిషత్
47. నిర్వాణోపనిషత్
48. మండలబ్రాహ్మణోపనిషత్
49. దక్షిణామూర్త్యుపనిషత్
50. శరభోపనిషత్
51. స్కందోపనిషత్
52. మహానారాయణోపనిషత్
53. అద్వయతారకోపనిషత్
54. రామరహస్యోపనిషత్
55. రామతాపిన్యుపనిషత్
(పూర్వతాపిన్యుపనిషత్,
ఉత్తరతాపిన్యుపనిషత్)
56. వాసుదేవోపనిషత్
57. ముద్గలోఎపనిషత్
58. శాండిల్యోపనిషత్
59. పైంగలోపనిషత్
60. భిక్షుకోపనిషత్
61. మహోపనిషత్
62. శారీరకోపనిషత్
63. యోగశిఖోపనిషత్
64. తురీయాతీతోపనిషత్
65. సన్న్యాసోపనిషత్
66. పరమహంసపరివ్రాజకోపనిషత్
67. అక్షమాలికోపనిషత్
68. అవ్యక్తోపనిషత్
69. ఏకాక్షరోపనిషత్
70. అన్నపూర్ణోపనిషత్
71. సూర్యోపనిషత్
72. అక్షుపనిషత్
73. అధ్యాత్మోపనిషత్
74. కుడికోపనిషత్
75. సావిత్ర్యుపనిషత్
76. ఆత్మోపనిషత్
77. పాశుపతబ్రహ్మోపనిషత్
78. పరబ్రహ్మోపనిషత్
79. అవధూతోపనిషత్
80. త్రిపురతాపిన్యుపనిషత్
81. శ్రీదేవ్యుపనిషత్
82. త్రిపురోపనిషత్
83. కఠరుద్రోపనిషత్
84. భావనోపనిషత్
85. రుద్రహృదయోపనిషత్
86. యోగకుండల్యుపనిషత్
87. భస్మజాబాలోపనిషత్
88. రుద్రాక్షజాబాలోపనిషత్
89. చణపత్యుపనిషత్
90. దర్శనోపనిషత్
91. తారసారోపనిషత్
92. మహావాక్యో పనిషత్
93. పంచబ్రహ్మోపనిషత్
94. ప్రాణాగ్నిహోత్రోపనిషత్
95. గోపాలతాపిన్యుపనిషత్
96. కృష్ణోపనిషత్
97. యాజ్ఞవల్క్యోపనిషత్
98. వరాహోపనిషత్
99. శాట్యాయనీయోపనిషత్
100. హయగ్రీవోపనిషత్
101. దత్తాత్రేయోపనిషత్
102. గరుడోపనిషత్
103. కలిసంతారణోపనిషత్
104. బాల్యుపనిషత్
105. సౌభాగ్యలక్ష్మ్యుపనిషత్
106. సరస్వతీ రహస్యోపనిషత్
107. బహ్వృచోపనిషత్
108. ముక్తికోపనిషత్

# పంచాంగం

పంచాంగము ముఖ్యముగా మనకు 5 విషయములను తెలుపును. 1. తిథి, 2. వారము, 3. నక్షత్రము, 4.యోగము, 5. కరణము, ఈ ఐదు అంగములను తెలుపుచున్నది. కనుకనే దానికి పంచాంగము అని పేరు వచ్చినది.

భూమి తనచుట్టు తాను తిరుగుటవలన సూర్యుని వెలుతురు గోళాఖారముగా ఉన్న భూభాగముపై పడిన వెలుగును పగలుగాను, దాని వెనుక వైపు భూభాగమును చీకటి (రాత్రి, పగలు)గా వ్యవహరిస్తున్నాము. ఈ విధంగా మనకు రాత్రి, పగలు ఏర్పడుచున్నవి. భూమి తనచుట్టుతాను ఒకసారి తిరుగుటను ఒకరోజు అనియు, చంద్రుడు భూమి చుట్టు ఒక ప్రదక్షిణము చేయుటను ఒక నెలఅనియు, భూమి సూర్యుని చుట్టు ఒక ప్రదక్షిణము చేయుటను ఒక సంవత్సరమనియు ప్రంచములోని అన్ని దేశములవారు లెక్కించుచున్నారు.

**రాశులు:-** గ్రహములు సంచరించుచున్న మార్గమును మన పూర్వీకులు జ్యోతిశ్చక్రముగా ఊహచేసి, దానిని 12 భాగములు (రాశులు)గా భాగించినారు. ఒక్కొక్క భాగములో నున్న నక్షత్రములరాశులకు రూపమును ఊహించి ఈ క్రింది విధముగా రకరకములపేర్లు పెట్టినారు.

| | |
|---|---|
| 1. మేషము - మేక | 7. తుల - త్రాసు |
| 2. వృషభము - ఎద్దు | 8. వృశ్చికము - తేలు |
| 3. మిథునము - దంపతులు | 9. ధనుస్సు - విల్లు |
| 4. కర్కాటకము - ఎండ్రకాయ | 10. మకరము - మొసలి |
| 5. సింహోము - సింగము | 11. కుంభము - కడవ |
| 6. కన్య - పడచు | 12. మీనము - చేప |

# నక్షత్రములు :

నక్షత్రములు మొత్తము 27గా నిర్ణయించి వాటికి ఈ క్రింది పేర్లు పెట్టినారు.

| | | |
|---|---|---|
| 1. అశ్విని | 10. మఖ | 19. మూల |
| 2. భరణి | 11. పుబ్బ | 20. పూర్వాషాఢ |
| 3. కృత్తిక | 12. ఉత్తర | 21. ఉత్తరాషాఢ |
| 4. రోహిణి | 13. హస్త | 22. శ్రవణము |
| 5. మృగశిర | 14. చిత్త | 23. ధనిష్ఠ |
| 6. ఆరుద్ర | 15. స్వాతి | 24. శతభిషము |
| 7. పునర్వసు | 16. విశాఖ | 25. పూర్వాభాద్ర |
| 8. పుష్యమి | 17. అనూరాధ | 26. ఉత్తరాభాద్ర |
| 9. అశ్లేష | 18. జ్యేష్ఠ | 27. రేవతి |

ఒక్కొక్క నక్షత్రము యొక్క కాలము ఒక రోజు (24 గంటలు) కన్న కొన్ని గంటలు తక్కువగా ఉండును. ఒక్కొక్క నక్షత్రమును 4 భాగములు (పాదములు)గా విభజించి 27 × 4 =108, పాదములుగా నిర్ణయించి అందులోని ఒక్కొక్క 9 నక్షత్రభాగములను ఈ క్రింది విధముగా ఒక రాశిగా నిర్ణయించినారు.అనగా ఒక నక్షత్ర భాగము యొక్క ఏ పాదములో ఒక శిశువు జన్మిస్తే ఏ రాశి క్రింద ఆ శిశువు యొక్క జననము పరిగణించ బడుతుందో ఈ క్రింద చూపనైనది.

| క్ర.సం | నక్షత్రములు | పాదములు | | | | రాశులు |
|---|---|---|---|---|---|---|
| 1 | అశ్విని | 1 | 2 | 3 | 4 | 1.మేషము |
| 2 | భరణి | 1 | 2 | 3 | 4 | |
| 3 | కృత్తిక | 1 | - | - | - | |
| | కృత్తిక | 2 | 3 | 4 | - | 2. వృషభము |
| 4 | రోహిణి | 1 | 2 | 3 | 4 | |
| 5 | మృగశిర | 1 | 2 | - | - | |
| | మృగశిర | 3 | 4 | - | - | 3. మిథునము |
| 6 | ఆరుద్ర | 1 | 2 | 3 | 4 | |
| 7 | పునర్వసు | 1 | 2 | 3 | - | |
| | పునర్వసు | 4 | - | - | - | 4. కర్కాటకము |
| 8 | పుష్యమి | 1 | 2 | 3 | 4 | |
| 9 | అశ్లేష | 1 | 2 | 3 | 4 | |
| 10 | మఖ | 1 | 2 | 3 | 4 | 5. సింహాము |
| 11 | పుబ్బ | 1 | 2 | 3 | 4 | |
| 12 | ఉత్తర | 1 | - | - | - | |
| | ఉత్తర | 2 | 3 | 4 | - | 6. కన్య |
| 13 | హస్త | 1 | 2 | 3 | 4 | |
| 14 | చిత్త | 1 | 2 | - | - | |
| | చిత్త | 3 | 4 | - | - | 7. తుల |
| 15 | స్వాతి | 1 | 2 | 3 | 4 | |
| 16 | విశాఖ | 1 | 2 | 3 | - | |
| | విశాఖ | 4 | - | - | - | 8. వృశ్చికము |
| 17 | అనూరాధ | 1 | 2 | 3 | 4 | |

| క్ర.సం | నక్షత్రములు | పాదములు | | | | రాశులు |
|---|---|---|---|---|---|---|
| 18 | జ్యేష్ఠ | 1 | 2 | 3 | 4 | |
| 19 | మూల | 1 | 2 | 3 | 4 | 9. ధనుస్సు |
| 20 | పూర్వాషాఢ | 1 | 2 | 3 | 4 | |
| 21 | ఉత్తరాషాఢ | 1 | - | - | - | |
| | ఉత్తరాషాఢ | 2 | 3 | 4 | - | 10. మకరము |
| 22 | శ్రవణము | 1 | 2 | 3 | 4 | |
| 23 | ధనిష్ఠ | 1 | 2 | - | - | |
| | ధనిష్ఠ | 3 | 4 | - | - | 11. కుంభము |
| 24 | శతభిషము | 1 | 2 | 3 | 4 | |
| 25 | పూర్వాభాద్ర | 1 | 2 | 3 | - | |
| | పూర్వాభాద్ర | 4 | - | - | - | 12. మీనము |
| 26 | ఉత్తరాభాద్ర | 1 | 2 | 3 | 4 | |
| 27 | రేవతి | 1 | 2 | 3 | 4 | |

## గ్రహములు–తిథులు

చంద్రుడు భూమిచుట్టుతిరుగుటవలన మనకు రోజుకొక నక్షత్ర మండలము నుండి చంద్రుడు కనబడుచున్నాడు. ఏ నక్షత్రమండలములో చంద్రుడు మనకు కనబడుచున్నాడో ఆ నక్షత్రమును మన పంచాంగపు వ్యవహారములలో ఆనాటి నక్షత్రముగా పరిగణించుచున్నాము. చిత్త నక్షత్ర మండలములో చంద్రుడు పౌర్ణమినాడు కనబడు మాసమునకు చైత్రమాసము అని పేరు పెట్టబడినది. ఈ ప్రకారముగా ఏ నక్షత్రమండలములో చంద్రుడు పౌర్ణమినాడు కనపడునో ఈ క్రింది విధముగా మాసములపేర్లు పెట్టినారు.

| నక్షత్రమండలము పేరు - మాసము పేరు | | |
|---|---|---|
| చిత్త | - | 1. చైత్ర |
| విశాఖము | - | 2. వైశాఖ |
| జ్యేష్ఠ | - | 3.జ్యేష్ఠము |
| పూర్వాషాఢ | - | 4. ఆషాఢము |
| శ్రవణము | - | 5. శ్రావణము |
| ఉత్తరాభాద్ర | - | 6. భాద్రపదము |

| నక్షత్రమండలము పేరు - మాసము పేరు | | |
|---|---|---|
| అశ్విని | - | 7. ఆశ్వయుజము |
| కృత్తిక | - | 8. కార్తీకము |
| మృగశిర | - | 9. మార్గశిరము |
| పుష్యమి | - | 10. పుష్యము |
| మఖ | - | 11. మాఘం |
| ఉత్తరఫల్గుణి | - | 12.పాల్గుణము |

## గ్రహములు : 9

| | | |
|---|---|---|
| 1. సూర్యుడు | 4. బుధుడు | 7. శనైశ్వరుడు (శని) |
| 2. చంద్రుడు | 5. బృహస్పతి (గురువు) | 8. రాహువు |
| 3. అంగారకుడు (కుజుడు) | 6. శుక్రుడు | 9. కేతువు |

ఇందులోని 7 గ్రహములకు సంబంధించిన పేర్లలో కొన్ని మార్పులతో మనం వ్యవహరిస్తున్న ఆది, సోమ, మంగళ, బుధ గురు శుక్ర, శనివారాలను నిర్ణయించడం జరిగినది.

# పక్షములు –తిథులు

నెలకు పక్షములు రెండు. ప్రతి నెలలోను మొదటి 15 రోజులకు శక్లపక్ష మనియు, రెండవ 15 రోజులకు కృష్ణపక్షమనియు పేర్లు. శుక్లపక్షమనగా వెన్నెలకాయు రోజులు. కృష్ణపక్షమనగా చీకటి వృద్ధియగు రోజులు.

పూర్తి వెన్నెలగా నుండు రోజునకు 'పూర్ణిమ' అనియు, పూర్తి చీకటిగానుండు రోజునకు 'అమావాస్య' అనియు అందురు.

**శుక్ల పక్షపు తిథులు 15, కృష్ణ పక్షపు తిథులు 15,**

**తిథులు (శుక్ల/కృష్ణ - పక్షము)**


| | | |
|---|---|---|
| 1. పాడ్యమి | 6. షష్ఠి | 11. ఏకాదశి |
| 2. విదియ | 7. సప్తమి | 12. ద్వాదశి |
| 3. తదియ | 8. అష్టమి | 13. త్రయోదశి |
| 4. చవితి | 9. నవమి | 14. చతుర్దశి |
| 5. పంచమి | 10. దశమి | 15. పౌర్ణమి / అమావాస్య |

## కాలమాన చక్రము

ఈ క్రింద (తెలిపిన) 60 సంవత్సరములు ఆయా సంవత్సరములందు మార్చి15 నుండి ఏప్రిల్ 15 మధ్య ఆరంభమగుచుండును

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. ప్రభవ | 1987 | 21. సర్వజిత్ | 2007 | 41. ప్లవంగ | 2027 |
| 2. విభవ | 1988 | 22. సర్వధారి | 2008 | 42. కీలక | 2028 |
| 3. శుక్ల | 1989 | 23. విరోధి | 2009 | 43. సౌమ్య | 2029 |
| 4. ప్రమోదూత | 1990 | 24. వికృత | 2010 | 44. సాధారణ | 2030 |
| 5. ప్రజాపతి | 1991 | 25. ఖర | 2011 | 45. విరోధికృత్ | 2031 |
| 6. అంగీరస | 1992 | 26. నందన | 2012 | 46. పరీధావి | 2032 |
| 7. శ్రీముఖ | 1993 | 27. విజయ | 2013 | 47. ప్రమాదీచ | 2033 |
| 8. భావ | 1994 | 28. జయ | 2014 | 48. ఆనంద | 2034 |
| 9. యువ | 1995 | 29. మన్మథ | 2015 | 49. రాక్షస | 2035 |
| 10. ధాతు | 1996 | 30. దుర్ముఖి | 2016 | 50. నల | 2036 |
| 11. ఈశ్వర | 1997 | 31. హేవిళంబి | 2017 | 51. పింగళ | 2037 |
| 12. బహుధాన్య | 1998 | 32. విళంబి | 2018 | 52. కాళయుక్తి | 2038 |
| 13. ప్రమాధి | 1999 | 33. వికారి | 2019 | 53. సిద్ధార్థి | 2039 |
| 14. విక్రమ | 2000 | 34. శార్వరి | 2020 | 54. రౌద్రి | 2040 |
| 15. వృష | 2001 | 35. ప్లవ | 2021 | 55. దుర్మతి | 2041 |
| 16. చిత్రభాను | 2002 | 36. శుభకృత్ | 2022 | 56. దుందుభి | 2042 |
| 17. స్వభాను | 2003 | 37. శోభకృత్ | 2023 | 57. రుధిరోద్గారి | 2043 |
| 18. తారణ | 2004 | 38. క్రోధి | 2024 | 58. రక్తాక్షి | 2044 |
| 19. పార్థివ | 2005 | 39. విశ్వావసు | 2025 | 59. క్రోధన | 2045 |
| 20.వ్యయ | 2006 | 40. పరాభవ | 2026 | 60. అక్షయ | 2046 |

# దిక్కులు


వాయవ్యము
ఉత్తరం
ఈశాన్యము
వాయువు
కుబేరుడు
శివుడు
పడమర వరుణుడు
ఇంద్రుడు తూర్పు
నైఋతి నిఋతి
యముడు
అగ్ని
దక్షిణం
ఆగ్నేయము

# కల్పకాల సిద్ధాంతం

## I మహాయుగం

| యుగము పేరు | సంవత్సరములు |
|---|---|
| 1) కృతాయుగము | 17,28,000 |
| | (కలియుగానికి నాలుగు రేట్లు) |
| 2) త్రేతాయుగము | 12,96,000 |
| | (కలియుగానికి మూడు రేట్లు కాలం) |
| 3) ద్వాపరయుగము | 8,64,000 |
| | (కలియుగానికి రెట్టింపు కాలం) |
| 4) కలియుగము | 4, 32,000 |
| | (మహాయుగం) |
| **మొత్తం నాలుగు యుగములకాలము** | **43,20,000** |

## II మన్వంతరం : 71 మహాయుగాలకాలం

4320000 x 71 = 30,67,20,000 సంవత్సరములు

## III కల్పకం : 14 మన్వంతరాలు = బ్రహ్మదేవునికి (ప్రకృతికి) ఒక పగలు

30,67,20,000 x 14 = 429,40,80,000 బ్రహ్మదేవునికి (ప్రకృతికి) ఒక పగలు

ప్రకృతి ఉద్భవించడంతో ప్రారంభమైన కల్పకం మళ్ళీ ప్రకృతి పూర్తిగా అంతరించడంతో ముగుస్తుంది. బ్రహ్మదేవునికి ఒక పగలు అంటే అదే. ప్రకృతి ఒక గ్రహంపై అంతరించి మళ్ళీ మరో గ్రహంపై ఉద్భవించడానికి మధ్యనుండే కాలం మరో కల్పకం దీన్ని బ్రహ్మదేవుని రాత్రి అంటారు.

## IV బ్రహ్మకు ఒక రోజు :

429,40,80,000 × 2 = 858,81,60,000 సంవత్సరములు

## V బ్రహ్మకు ఒక సంవత్సరం :

858816000 × 365 = 3,13,467,84,00,000.సంవత్సరములు

# ఇంకొక సిద్ధాంతం ప్రకారం

**VI యహోరాత్రము** (ఒక రాత్రి మరియు ఒక పగలు = ఒక రోజు బ్రహ్మకు): 2000 చతర్యుగాలు 43,20000 × 2000 = 864,00,00,000 సంవత్సరములు

## VII సంవత్సరము (బ్రహ్మకు) :

864,00,00,000 × 365 = 3,15,360,00,00,000 సంవత్సరములు



వేదం మానవజాతిని సరియైన మార్గంలో పయనించే విధంగా చేయడానికి ఆ పరమాత్ముడు ఉపదేశించిన ఓ మంత్రం. భారతీయ సంస్కృతికి, విజ్ఞానానికి జీవన విధానానికి వేదాలు మూలం.

మన భారతీయ సంస్కృతి ఇప్పటికీ ప్రపంచంలో అత్యున్నతంగా గౌరవింపబడు తుందంటే అది అంతయు వేదం చేసిన మహాత్మ్యం.

వివాహం వేదం నిర్వచించిన ఓ సుమహత్తర వ్యవస్థ. దీని ద్వారా ఏర్పడిన కుటుంబ వ్యవస్థ అనేది ప్రపంచంలో ఈ నాటికీ భారతీయులను ప్రత్యేకంగా నిలబెడుతున్నది. మానవుడు ప్రేమ, అభిమానం, ఆత్మీయత, అనురాగం, ఈర్ష్య ద్వేషం, ప్రతీకారం లాంటి సమస్తము కుటుంబం నుండే నేర్చుకుంటాడు. నేటి, రేపటి ఎంతటి ప్రగతిశీల సమాజం ఐనా కుటుంబ సంక్షేమం మీదనే ఆధారపడి ఉంటుంది.

మన భారతీయ ప్రాచీన సంస్కృతిలోని వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు చెబుతున్న మహోన్నత భావాలను ఏ కొద్దిమందో చదివి అర్థం చేసుకొని వారిదగ్గరే దాచుకోవడం వలన మన ప్రాచీన సంస్కృతి గురించి సామాన్యులకు తెలియకుండా పోతున్నది. ఇటువంటి సందర్భంలో మలహాల్ రావు గారు, పోలీసు శాఖలో పనిచేస్తూ, నిరంతరం పనిలో పరుగెడుతూ కూడా పుస్తక పఠనంపై మక్కువ పెంచుకొని , ఎన్నో పుస్తకాలను చదివి తను చదివిన పుస్తకాలలోని విజ్ఞానాన్ని మన భారతీయ మహోన్నతిని చాలా సులభతరంగా సామాన్యులకు సైతం అర్థం అయ్యే రీతిలో 'మన సంస్కృతి' ద్వారా తెలియజేసే ప్రయత్నం చేయడం అపూర్వం.

ఇవే కాక, మహనీయుల పలుకులను మననం (ధ్యానం) చేసుకొనే విధంగా, 'ఆణిముత్యాలు' తెలుగులో, ఇంగ్లీష్‌లో 'సెన్స్ ద ఎసెన్స్' ను మరియు నిత్య జీవితంలో మన జీవనం సాఫీగా సాగాలంటే ఉండాల్సిన లక్షణాలను ఏర్చి కూర్చిన 'జీవన కిరణాలు' వీరి ఇతర రచనలు.